Follow: @ANNTELUGU

05-06-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 157 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

# చంద్రబాబు.. ఎక్సలెంట్

రెండేళ్ళపాలన సూపర్ అన్న 63శాతం మంది

ఎఎన్ఎన్ మహా సర్వేలో జనాభిప్రాయం



**అమరావతి, మహా :** ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండేళ్ళపాలనపై ఎఎన్ఎన్ ఛానల్ జనాభిప్రాయాన్ని ఒడిసిపట్టే ప్రయత్నం చేసింది. ఏఎన్ఎన్ పోల్ కు నాలుగు గంటల్లో 12వేల మంది తమ అభిప్రాయం తెలపగా, 51శాతం మంది చంద్రబాబు ఎక్స్ లెంట్ అని, 12శాతం మంది బాగుంది అని చెప్పారు. దీంతో పోల్ లో పాల్గొన్న వారిలో 63శాతం మంది బాబు పాలన బాగుందని తేల్చిచెప్పారు. జూన్ 4తో ఏపీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు కాగా బాబు పాలన మంచిగా ఉందని ప్రజాభిప్రాయం స్పష్టమైంది. రెండేళ్ళలోనూ ప్రజల నమ్మకం నిలుపున్నట్లుగా రేటింగ్ స్పష్టం చేస్తోంది. ఎఎన్ఎన్ ఛానల్, మహా పత్రిక నిఖార్సయిన పద్ధతిలో పోల్స్ నిర్వహిస్తూ, ఉన్నది ఉన్నట్లుగా ప్రజాభిప్రాయం చెప్పడంలో ముందు వరుసలో నిలుస్తుంది. రాష్ట్రం ఆర్థికసవాళ్ళతో పాటు అనేక రకాల ఇబ్బందులున్నా బాబుపై ప్రజలు భరోసా ఉంచారు. మిగిలిన వారిలో 21శాతం మంది బాగాలేదని చెప్పగా, మిగతా వారు యావరేజ్ అని తేల్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని ప్రజాదరణతో సంచలన విజయం సాధించిన చంద్రబాబు అదే స్థాయి ఓటింగ్ ను కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది.

03

టాప్ న్యూస్

## మళ్ళీ డీలిమిటేషన్ కసరత్తు

ప్రాంతీయ పార్టీలతో రహస్య చర్చలు



02

## 8న ఇండియా కూటమి కీలక భేటీ

హాజరుకానన్న డీఎంకే



02

## తిరుచ్చి నుండి లారెన్స్? టీవీకే విజయ్ మెగా ప్లాన్



03



## మీనాక్షి నటరాజన్ కు రాజ్యసభ

- మధ్యప్రదేశ్ నుండి ప్రకటించిన హైకమాండ్
- షర్మిలకు నో ఛాన్స్

03



# పాలమూరు.. రేవంతు

## జలధారల సవాల్

ప్రాజెక్టుల పూర్తికి సీఎం సంకల్పం

బిరబిరా కృష్ణమ్మ పరుగులెత్తేలా.. ప్లాన్

రెండురోజుల పర్యటనతో.. రోడ్ మ్యాప్

(హైదరాబాద్ మహా): బిరబిరా కృష్ణమ్మ పరుగులెత్తే పాలమూరు గడ్డ.. దశాబ్దాలుగా సాగునీటి కోసం తపిస్తూనే ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సస్యశ్యామలం కావాలన్నా, వలసల జిల్లా అనే ముద్ర చెరిగిపోవాలన్నా ఇక్కడి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికావడం ఒక్కటే ఏకైక మార్గం. మొత్తం 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, పాలమూరును పచ్చని పసిడి నేలగా మార్చాలనేది ఇక్కడి రైతాంగం కల. ఈ తరుణంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన సొంత గడ్డపై జరుపుతున్న పర్యటన పాలమూరు ప్రజల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. మక్తల్ నారాయణపేట ప్రాజెక్టుపై సీఎం ప్రత్యేక ఫోకస్ పెట్టడంతో కర్నాటక ప్రభుత్వంతో ఉన్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. దీంతో పాలమూరు ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

**ఏళ్ళుగా సమస్యలు**

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఏళ్లుగా సాగుతున్న భూసేకరణ సమస్యలు, నిలిచిపోయిన నిధుల కారణంగా ఎక్కడికక్కడ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా ప్రాజెక్టులు కళ్లముందే ఉన్నా, ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందక రైతులు వర్షాధారంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ముఖ్యమంత్రిగా తన పుట్టినగడ్డపై మిగతా 2వ పేజీలో



## నేరుగా ఫీల్డ్ కు..

**మహబూబ్ నగర్, మహా :** మక్తల్ - నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు మిగతా 2వ పేజీలో



హైదరాబాద్ శివారులో భూముల విలువ

## బాగా పెరుగుతోంది

02

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచలేదు

ఏ శాఖ కేటాయించినా మనస్ఫూర్తిగా పనిచేస్తా

శాఖల మార్పు ప్రచారం పై పొంగులేటి రియాక్షన్

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు పోటెత్తిన జనం

గరిష్టంగా వంద శాతం పెరిగిన భూముల విలువలు.

02

- రాష్ట్రవ్యాప్తంగా 144 ప్రధాన, 570 జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా సేవల వెల్లువ.
- ఒక్క రోజే ఖజానాకు కోట్లలో రాబడి.
- ఏటా అదనంగా రూ.1,500 కోట్ల ఆదాయమే ప్రభుత్వ లక్ష్యం.




## వైఎస్సార్ పై ఆరోపణలు చేస్తావా?

- పవన్ పై కాంగ్రెస్ నేత కేవీపీ ఫైర్

03

## అనుమతి ఉన్నా లేకున్నా.. ధర్నా ఆగదు

- కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక




03

## జనసేనతో పొత్తుపై హైకమాండ్ దే నిర్ణయం

02

- బీజేపీ చీఫ్ రామచందర్ రావు



థాయ్‌లాండ్ - హైదరాబాద్

## డ్రగ్స్ లింక్ బట్టబయలు

### ఏకంగా 300 మంది క్యారియర్లు

ఈగల్' టీమ్ దెబ్బకు కుప్పకూలిన ఇంటర్నేషనల్ ముఠా సామ్రాజ్యం.

మత్తు దందాలో వెలుగుచూస్తున్న కళ్లు చెదిరే నిజాలు.

03






## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం


- మూడంతస్తుల భవనంతో పాటు ఇరవైకిపైగా దుకాణాలు దగ్ధం
- గంటల తరబడి శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది
- ఒకరికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- రోజంతా భారీగా ట్రాఫిక్ జాం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ సిటీ నడిబొడ్డు అమీర్‌పేట మెయిన్ రోడ్డులో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మైత్రీవనం సమీపంలో మెయిన్ రోడ్డుపైనే ఉన్న ఓ బొమ్మల దుకాణంలో మంటలు చెలరేగాయి. అవి ఆర్పేలోపు మొత్తం ఆ బిల్డింగ్‌లో ఉన్న అని దుకాణాలకు వ్యాపించాయి. చుట్టుపక్కల షాపులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. మిగతా 2వ పేజీలో



# ట్రంప్ కు షాకిచ్చిన అమెరికా ప్రతినిధుల సభ

**ఇరాన్ పై చర్యలొద్దని తీర్మానం**



**మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు అమెరికా ప్రతినిధుల సభ షాకిచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్యలు నిలిపివేసే తీర్మానానికి అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానానికి 215 మంది అనుకూలంగా.. 208 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. అనవసర, భారీ ఖర్చుతో కూడిన యుద్ధానికి వెంటనే ముగింపు పలకాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీలో సీనియర్ సభ్యుడైన న్యూయార్క్ డెమోక్రటిక్ ప్రతినిధి గ్రెగొరీ మీక్స్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధుల సభలో నిర్వహించిన ఓటింగ్‌లో నలుగురు రిపబ్లికన్‌లు ట్రంప్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా ఓటు వేయడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ అధికారికంగా యుద్ధం ప్రకటిస్తేనో, సైనిక చర్యలకు ఆమోదం ఇస్తే తప్ప.. అమెరికా బలగాలు ఇరాన్ పై ఎలాంటి దూకుడు చర్యలకు దిగకూడదని ఈ తీర్మానం ట్రంప్‌ను ఆదేశిస్తుంది. అమెరికా ప్రతినిధుల సభ 'వార్ పవర్స్ రిజల్యూషన్'ను ఆమోదించడం వైట్‌హౌస్‌కు పెద్ద దెబ్బ. అయితే, ఇరాన్‌తో మూడు నెలలుగా కొనసాగుతోన్న సంఘర్షణను ఇది తక్షణమే ముగిస్తుందని చెప్పలేం. స్వల్ప తేడాతో ఆమోదం పొందిన ఈ తీర్మానం.. ఇరాన్‌పై ట్రంప్ చర్యలకు వ్యతిరేకత వ్యక్తమైందనే విషయం స్పష్టమవుతుంది. ఇప్పుడు ఈ యుద్ధ అధికారాల తీర్మానం సెనెట్‌కు వెళ్తుంది. అక్కడ దీనికి ఆమోదం లభిస్తే.. ఆ తర్వాత అది అధ్యక్షుడు ట్రంప్ వద్దకు చేరుతుంది. ఆయన దీనిని వీటో చేయవచ్చు. ఇటీవల కుదిరిన కాల్పుల విరమణను పునరుద్ధరించేందుకు ఇజ్రాయెల్ లెబనాన్‌లు అంగీకరించాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన నాలుగోవిడత చర్చల అనంతరం ఇరుదేశాలు ఇందుకు అంగీకారం తెలిపాయి. ఒప్పందంలో భాగంగా.. వివాదాలను పూర్తిగా పరిష్కరించే విషయంపై మరిన్ని ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. ఇందులో ఇరాన్‌కు మద్దతిస్తున్న హెజ్‌బొల్లా పూర్తిగా కాల్పులను నిలిపివేయాలని, దక్షిణ లిటాని సెక్టార్ నుంచి బలగాలు వెనుదిరగాలనే షరతులు కూడా ఉన్నాయి.




# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

**( మొదటి పేజీ తరువాయి )**

భారీగా ఎగసిపడుతున్న మంటలు కమ్ముకున్న పొగతో ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది.

బొమ్మల దుకాణం నుంచి

బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు పక్కనే ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ అనే బట్టల దుకాణానికి అంటుకోవడంతోనే మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. మొత్తం బిల్డింగ్ మంటలు వ్యాపించాయి. బిల్డింగ్ మొత్తం నిలువెల్లా తగలబడిపోయింది. భగభగ మండే మంటలతో దగ్గరకు వెళ్లటానికి సైతం అగ్నిమాపక సిబ్బంది భయపడిపోయారు.

**20కిపైగా దుకాణాలు దగ్ధం.**


బిల్డింగ్ మొత్తం మంటల్లో కాలిపోతున్న విజువల్స్ చుట్టు పక్కల వాళ్లను భయాందోళనలకు గురిచేశాయి. మూడు అంతస్తుల ఈ బిల్డింగ్ మొత్తం కాలిబూడిద అయ్యింది. ఈ బిల్డింగ్ చుట్టూ హోటళ్లు, రెస్టారెంట్లు, కంప్యూటర్ షాపులు, సెల్ ఫోన్ షాపులు ఇలా చాలా షాపులు ఉన్నాయి. వీటిలో 20కిపైగా షాపులు కాలిబూడిదయ్యాయి. మండే ఎండలకు మంటలు చుట్టుపక్కల ఉన్న షాపులకు వ్యాపించాయి. మంటల ధాటికి చుట్టుపక్కల ఉన్న వ్యాపారులు అందరూ వారి షాపుల్లోని విలువైన వస్తువులను బయటకు తీసుకొచ్చి అక్కడి నుంచి పరుగులు తీయడంతో భయానక వాతావరణం చోటు చేసుకుంది. మంటలకు ఒక వ్యక్తి గాయపడ్డట్ల అధికారులు తెలిపారు. వెంటనే అతడికి ఆస్పత్రికి తరలించారు. మంటల్లో తగలబడిపోయిన షాపులలో పని చేసే వ్యక్తికి గాయాలైనట్లు అధికారులు చెప్పారు.

**భారీగా ట్రాఫిక్ జామ్**

విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు స్పాట్ కు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. కేఎస్ఆర్ ఫ్యాషన్స్ షాపులో అన్నీ దుస్తులు కావటంతో మంటల స్థాయిలో తీవ్రమైంది. పొగ, మంటలు కారణంగా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట మధ్య రాకపోకలు దాదాపు రోజంతా నిలిచిపోయాయి. పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మార్గంలో వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ట్రాఫిక్‌ను నియంత్రించారు. మంటలను అదుపులోకి తీసుకు వచ్చినప్పటికీ పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేందుకు రాత్రి అయ్యింది. నిత్యం వాహనాల రద్దీకి కిటకిటలాడే రహదారి కావడంతో ఈ మార్గంలో వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలలో పంపించారు.

# 8న ఇండియా కూటమి కీలక భేటీ

**హాజరుకానన్న డీఎంకే**




**ఢిల్లీ, మహా :** జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ పంజుకోగా, బెంగాల్ లో ఓటమిపాలైన మమతకు రాహుల్ గాంధీ అండగా నిలిచారు.

# తిరుచ్చి నుండి లారెన్స్?

**టీవీకే విజయ్ మెగా ప్లాన్**

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయ ముఖచిత్రం రోజుకో ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. దళపతి విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం' (టీవీకే) పార్టీ ఇటీవల జరిగిన 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సృష్టించిన ప్రభంజనం, ఆ పార్టీ సాధించిన చారిత్రాత్మక విజయం ఇంకా చర్చనీయాంశంగానే ఉన్నాయి. ఈ తరుణంలో త్వరలో జరగనున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో టీవీకే అభ్యర్థిగా ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తమిళ రాజకీయ వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. టీవీకే అధినాయకత్వం ఈ దిశగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గానికి టీవీకే పార్టీ పరంగా అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇటీవల మే నెలలో వెలువడిన 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే అధినేత సి. జోసెఫ్ విజయ్ స్వయంగా ఇదే నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. అయితే, అనివార్య కారణాల వల్ల ఆ స్థానం ఖాళీ కావడంతో ఇప్పుడు అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. తమ అధినేత ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని భావిస్తున్న టీవీకే.. అందుకు తగ్గట్లుగానే బలమైన అభ్యర్థి కోసం అన్వేషించి రాఘవ లారెన్స్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. విజయ్ రాజకీయ రంగ ప్రవేశాన్ని తొలి నుంచి బహిరంగంగా స్వాగతించిన వారిలో లారెన్స్ ముందు వరుసలో ఉన్నారు. ఇటీవల టీవీకే సాధించిన చారిత్రక విజయం పట్ల కూడా తన స్నేహితుడు విజయ్‌కు లారెన్స్ సామాజిక మాధ్యమాల వేదికగా ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఘవ లారెన్స్‌కు కేవలం సినీ రంగంలోనే కాకుండా, తన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశాబ్దాలుగా చేస్తున్న విస్తృతమైన సామాజిక సేవా కార్యక్రమాలతో తమిళనాడు ప్రజల్లో క్రేజ్ సంపాదించుకున్నారు

# పాలమూరు..రేవంతు



**( మొదటి పేజీ తరువాయి )**

రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రేమను కురిపిస్తారని సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భారీ నిధులను సమకూర్చి పనులను పరుగులు పెట్టిస్తారని పాలమూరు బిడ్డలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్ని నిధులైనా ఇస్తా భూసేకరణ పూర్తిచేయండి అని సీఎం అనేక సందర్భాల్లో చెప్పారు. ఇపుడు సీఎం పట్టుదలతో గట్టి అడుగువేశారు. తెలంగాణ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి క్రిష్ణారావు, వాకిటి శ్రీహరి, దామోదర రాజనర్సింహ కూడా శుక్రవారం సీఎం పర్యటనలో పాల్గొన్నారు. కొనసాగుతున్న ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1.11 లక్షల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు సేకరించింది: 1.07 లక్షల ఎకరాలు సేకరించారు. ఇంకా 4,694 ఎకరాలు సేకరించాల్సింది ఉంది.

ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి

**1. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం:**

లక్ష్యం: 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం.

**ప్రస్తుత పరిస్థితి:** నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లు పూర్తికావొచ్చాయి. ఉదండాపూర్‌తో కలిపి దాదాపు 60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది.

**కీలక పని:** 3వ ప్యాకేజీలోని నార్లాపూర్‌ఏదుల మధ్య గ్రావిటీ కాల్వ పూర్తయితే కర్వెన వరకు నీటి తరలింపు సులువవుతుంది. పంపుహౌస్‌ల పనులు ఇంకా సాగుతున్నాయి.

**2. నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతలు:**

ఊట్కూరు పెద్ద చెరువు నుండి బాపూర్ పంపుహౌస్ వరకు కాలువ పనులు, పైపులైను, భూత్పూర్‌కాట్రేవుపల్లి, కానుకుర్తి గ్రావిటీ కెనాల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు 560 ఎకరాల భూసేకరణ జరిగింది. భూసేకరణ త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టును పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**3. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం :**

ప్రస్తుత రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4 టీఎంసీల లోపే ఉంది. ప్రతిపాదించిన 20 రిజర్వాయర్ల నిర్మాణం ముందడుగు పడలేదు. డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాల్వలు పూర్తయితే మరో 1.44 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు అందుతుంది. దీనికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటనలో అధికారయంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

**4. సంగంబండ ప్రాజెక్టు:** మాగనూరు, మక్తల్, కృష్ణ, నర్వ మండలాలకు సాగునీరందించే ప్రధాన కాలువల నిర్మాణం ఇక్కడ విజయవంతంగా పూర్తయింది. కానీ, క్షేత్రస్థాయిలో అనేక పునరావాస సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు.

**5. కోయిలసాగర్ ఐలాండ్:** ఈ ప్రాజెక్టు పరిధిలో కొత్తగా మరో 14 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే, దీనికి అవసరమైన కొత్త కాలువ (న్యూ కెనాల్) నిర్మాణం ఇంకా చేపట్టాల్సి ఉంది.

**6. ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం):** ఈ ప్రాజెక్టు కింద మొత్తం 85 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనేది ప్రధాన లక్ష్యం. కానీ ప్రస్తుతం సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల అందులో సగం ఆయకట్టుకు మాత్రమే నీరు పారుతోంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కొంతవరకు ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, శాశ్వత రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన భారీ భూసేకరణ పనులు ఇంకా ముందడుగు పడలేదు.

**7. ఎస్ ఎల్ బిసి (శ్రీశైలం ఎడమగట్టు కాలువ) సొరంగం:** ఈ ప్రాజెక్టులో అత్యంత కష్టతరమైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సొరంగ మార్గం పూర్తి కావడానికి ఇంకా 9.533 కిలోమీటర్ల పొడవునా కొండలను తవ్వాల్సి ఉంది. ఈ భారీ తవ్వకం పనులు పూర్తయితేనే ప్రాజెక్టు పూర్తి రూపం దాలుస్తుంది.

**8. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం:** ఈ ప్రాజెక్టు పరిధిలో పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ముఖ్యంగా కానాయపల్లి ఆర్ఆర్ (పునరావాస) కాలనీ నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. దీనితో పాటు ప్రధాన కెనాల్ విస్తరణ పనులు, శంకరసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలో నిలిచిపోయిన పనులను తక్షణమే ప్రారంభించాల్సి ఉంది.



## నేరుగా ఫీల్డ్ కు..


**( మొదటి పేజీ తరువాయి )**

పలు సూచనలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పనులను పరిశీలించడానికి గురువారం బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా మక్తల్ - నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనులను వివరించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టు ప్యాకేజీ 1 సైట్ వద్దకు చేరుకుని అక్కడ పనులను పరిశీలించారు. ప్యాకేజీ 1లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత మేరకు పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి వెంట మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ , జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరితో పాటు కర్నాటక మాజీ మంత్రి ఎన్ఎస్ బోసెరాజు , ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. అనంతరం జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష జరిపారు. ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టుల నిర్మాణ పనులను, కాల్వలను పరిశీలించారు.

## అనుమతి ఉన్నా లేకున్నా.. ధర్నా ఆగదు

**: కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక**

ఢిల్లీ, మహా : ఆన్‌లైన్‌లో వ్యంగ్య వేదికగా ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఇప్పుడు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ప్రకటించింది. పోలీసుల అనుమతి లభించినా, లభించకపోయినా శాంతియుత పద్ధతిలో తమ నిరసనను కొనసాగిస్తామని పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు.




# సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు పోటెత్తిన జనం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు జనం పోటెత్తారు. కొత్త ధరలు, పెరిగిన స్టాంప్ డ్యూటీ ఛార్జీల బాదుడు నుంచి తప్పించుకునేందుకు దస్తావేజులు పట్టుకుని కొనుగోలుదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బారులు తీరారు. ఆఖరి రోజైన గురువారం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆఫీసులు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ఈ అనూహ్య రద్దీని, ప్రజల ఆత్రుతను ముందుగానే పసిగట్టిన ప్రభుత్వం, మే 29వ తేదీ నుంచే ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు కార్యాలయాల పనివేళలను భారీగా పొడిగించింది. ఈ విపరీతమైన రద్దీని ఆసరాగా చేసుకుని ఎలాంటి అవకతవకలు జరగకుండా రాష్ట్ర విజిలెన్స్ అధికారులు దేగకన్ను వేశారు. జూన్ 4 మధ్యాహ్నం 3:25 గంటల సమయంలోహైదరాబాద్ శివారులోని అత్యంత రద్దీగా ఉండే శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, నగర ప్రాంతాల్లో 144 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిరంతరం పనిచేస్తుండగా.. గ్రామీణ ప్రజలు రిజిస్ట్రేషన్ల కోసం పట్టణాలకు రాకుండా వారి ముంగిటకే సేవలు అందించేందుకు ఏకంగా 570 మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాలకు 'జాయింట్ సబ్ రిజిస్ట్రార్' హోదాను ప్రభుత్వం కల్పించింది. సవరించిన భూముల ధరల వార్తలు, రిజిస్ట్రేషన్ల రద్దీ రాష్ట్ర ఖజానాపై అక్షరాలా కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (202526)లో రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏకంగా రూ. 15,262 కోట్ల అపారమైన ఆదాయం సమకూరింది. ఈ ఏడాది మే నెలలో మాత్రమే ఏకంగా రూ. 1,700 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. ఇది గత ఏడాదితో పోలిస్తే 24.2 శాతం భారీ వృద్ధి. ఆఖరి నిమిషం రద్దీ కారణంగా ఒక్క జూన్ 3, 4 తేదీల్లో రికార్డు స్థాయిలో కలెక్షన్లు నమోదయ్యాయి. ఉదాహరణకు, కేవలం ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ఒక్కరోజులో 408 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, ఏకంగా రూ. 2.88 కోట్ల రాబడి రావడం మార్కెట్ వేగాన్ని సూచిస్తోంది. ఈ పటిష్టమైన ఆర్థిక ప్రవాహంతో, 202627 ఆర్థిక సంవత్సరానికి గాను ఏకంగా రూ. 19,000 కోట్ల భారీ ఆదాయాన్ని ఆర్జించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యంగా నిర్దేశించింది.

**ఖాజాగూడ ఆల్ టైమ్ రికార్డు**

నూతన భూముల ధరలను పెంచే క్రమంలో ప్రభుత్వం ఒక అత్యంత హేతుబద్ధమైన నాలుగు అంచెల వ్యవస్థను ప్రవేశపెట్టింది. స్థానిక డిమాండ్, మౌలిక సదుపాయాల ఆధారంగా పాత రిజిస్ట్రేషన్ విలువలపై 25 శాతం, 50 శాతం, 75 శాతం, గరిష్టంగా 100 శాతం చొప్పున పెంపును నిర్దేశించింది. ప్రధాన పట్టణాల్లో మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రేట్లకు మధ్య ఏకంగా 500 నుంచి 600 శాతం వ్యత్యాసం ఉన్నప్పటికీ, ప్రజలపై భారం పడకుండా గరిష్ట పెంపును వంద శాతానికే పరిమితం చేసింది. మార్కెట్ ధరలు ఇప్పటికే ప్రభుత్వ విలువలతో సమానంగా ఉన్న సుమారు 10 శాతం ప్రాంతాల్లో (జూబ్లీహిల్స్ లాంటి చోట్ల) ఎలాంటి మార్పూ చేయలేదు. ఈ తాజా సవరణలతో ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ ఐటీ కారిడార్లలోని ఆస్తుల విలువలు ఊహకందని స్థాయికి చేరాయి. రాష్ట్రంలోనే అత్యధిక మార్కెట్ విలువ రంగారెడ్డి జిల్లాలోని ఖాజాగూడలో నమోదైంది. ఇక్కడ ఎకరం పాత విలువ రూ. 24 కోట్లు ఉండగా, ఇప్పుడు అది రికార్డు స్థాయిలో రూ. 30 కోట్లకు చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమి కనీస ధరను ఎకరాకు రూ. 2.75 లక్షలుగా నిర్దేశించగా, క్యూర్ ప్రాంత పరిధిలో ఇది రూ. 15 లక్షలుగా ఖరారైంది. వాణిజ్యపరమైన ఓపెన్ ప్లాట్ల విషయానికొస్తే గచ్చిబౌలి కమర్షియల్ ఏరియాలో గరిష్ట ధర చదరపు గజానికి రూ. 1.15 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్పుల ద్వారా ప్రభుత్వానికి ఈ ఆర్థిక సంవత్సరంలో సునాయాసంగా అదనంగా రూ. 1,200 కోట్ల నుంచి రూ. 1,500 కోట్ల వరకు రాబడి పెరుగుతుందని అధికారిక అంచనా.




## మళ్ళీ డీలిమిటేషన్ కసరత్తు

**ప్రాంతీయపార్టీలతో రహస్య చర్చలు**

**ఢిల్లీ, మహా :** నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం మళ్ళీ ఫోకస్ చేసింది. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోందని.. ఇందుకు సంబంధించి ఓ కొత్త బిల్లును తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఢిల్లీలో చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది దేశంలో రాజకీయంగా ఎలాంటి వివాదాలకు దారితీయకుండా, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుతూ, న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేలా ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రాంతీయ పార్టీలతో ఇప్పటివరకు జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని, చట్టాన్ని ముందుకు తీసుకెళ్లే ముందే ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. రహస్యచర్చలు జరుపుతున్న కేంద్రం అన్ని పార్టీల మధ్య ఓ స్పష్టమైన అవగాహన, ఒప్పందం కుదిరిన వెంటనే ఈ బిల్లుపై తదుపరి అడుగులు వేయనుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు దేశంలో జరగబోయే అత్యంత ప్రభావవంతమైన రాజకీయ, రాజ్యాంగపరమైన ప్రక్రియలలో ఈ నియోజకవర్గాల పునర్విభజన ఒకటి కానుంది. ఇది దేశ పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని, కేంద్రరాష్ట్రాల సంబంధాలను, దేశ భవిష్యత్తు ఎన్నికల ముఖచిత్రాన్ని శాసించే అవకాశం ఉంది.



## పొత్తుతో వస్తారా? సింగిల్ గా వస్తారా?

**పవన్ పై ప్రకాష్ రాజ్ కామెంట్స్**

**హైదరాబాద్, మహా :** మీరొస్తానంటే మేమొద్దంటామా.. రండి దొర.. కానీ వచ్చే ముందు ఉత్తుత్తినే వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా..? లేదా సింగిల్ గా వస్తున్నారా.. అనేది చెప్పి రండి. అంటూ ప్రకాష్ రాజ్ ట్వీట్ చేశారు. అంతే కాకుండా జస్ట్ ఆస్కింగ్... అంటూ హాష్ ట్యాగ్ ఇచ్చారు. అయితే ప్రకాష్ రాజ్ తన ట్వీట్‌లో ఎక్కడా పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించలేదు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయాల్లోకి వస్తానంటూ మీడియా సమావేశంలో చెప్పిన తరవాత ప్రకాష్ రాజ్ చేసిన ట్వీట్ ఆయన గురించే అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



## భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న బొల్లా బ్రహ్మనాయుడు

- **అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు**
- **పోలీసులకు, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు**

**హైదరాబాద్, మహా :** దాదాపు రూ.1,500 కోట్ల విలువైన భూములను కబ్జా చేయడానికి ప్రయత్నించారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ ల్యాండ్ గ్రాబింగ్ వివాదంలో నార్సింగి పోలీసులు తనతో పాటు మరికొందరిపై నమోదు చేసిన కేసులో అరెస్ట్ కాకుండా ఉండేందుకు ఆయన ముందస్తుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో స్పందించాలంటూ అటు నార్సింగి పోలీసులకు, ఇటు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం, ఆధారాలతో కూడిన కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న అనంతరం, హైకోర్టు ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 11వ తేదీకి వాయిదా వేసింది.

# జనసేనతో పొత్తుపై హైకమాండ్ దే నిర్ణయం

**బిజెపి చీఫ్ రామచందర్ రావు**

**హైదరాబాద్, మహా**

తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచేయలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.



# వైఎస్సార్ పై ఆరోపణలు చేస్తావా?

**పవన్ పై కాంగ్రెస్ నేత కేవీపీ ఫైర్**

హైదరాబాద్, మహా : వైఎస్సార్ పై పవన్ చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ కేవీపీ రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఒక ఘాటు బహిరంగ లేఖను సంధించారు. "కాంగ్రెస్ అనగానే మీకు వైఎస్సార్ గుర్తుకు వచ్చినందుకు ధన్యవాదాలు" అంటూనే... వైఎస్సార్‌పై పవన్ చేసిన ఆరోపణలను కేవీపీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ముఖ్యమైన రాజకీయ అంశాన్ని స్పష్టం చేశారు. వైఎస్సార్‌కు, ప్రస్తుత వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని కేవీపీ తేల్చి చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పవన్ పై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదని కేవీపీ గుర్తు చేశారు. నాడు వైఎస్సార్ కేసులు పెట్టమన్నారంటూ ఓ పోలీస్ అధికారికి తనకు చెప్పినట్టు పవన్ అంటున్నారని, ఆ పోలీస్ అధికారికి తక్షణమే లై డిటెక్టర్ పరీక్ష చేయించాలని కేవీపీ డిమాండ్ చేశారు. "ఒకవేళ ఆ అధికారి చెప్పింది నిజమని తేలితే... నేను తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 కోట్లు విరాళంగా ఇస్తాను" అంటూ కేవీపీ ఒక బహిరంగ సవాల్ విసిరారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి చనిపోయి 17 ఏళ్లు దాటిన తర్వాత కూడా.. ఇంకా ఆయనపై ఇలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అవివేకమని మండిపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇంకా చాలా బలంగా ఉందనే విషయాన్ని పవన్ గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను, విభజన చట్టం ప్రకారం రావాల్సిన ప్రయోజనాలను సాధించడం కోసం.. ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర ప్రభుత్వంపై పవన్ ఒత్తిడి తీసుకురావాలని హితవు పలికారు. పాత కక్షలను తవ్వుకుంటూ కూర్చోకుండా, డిప్యూటీ సీఎంగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.

# మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి జూన్ 4 మహా :** మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.

గురువారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా సమాఖ్య ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ..ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల కేంద్రం, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ), ప్రధాన బ్యాంకర్ల సమన్వయ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ వినియోగంపై విస్తృతంగా చర్చించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న రుణాలు, సబ్సిడీలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, మార్కెటింగ్ సదుపాయాలు మరియు ఇతర ప్రోత్సాహక పథకాల వివరాలను మహిళా సంఘాల సభ్యులకు తెలిపారు.మహిళా సంఘాలు సంప్రదాయ వృత్తులకు మాత్రమే పరిమితం కాకుండా ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్, డిజిటల్ సేవలు, సూక్ష్మ పరిశ్రమలు, పర్యావరణ హిత ఉత్పత్తుల తయారీ, సేవా రంగం మరియు ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖలలో అమలవుతున్న అన్ని పథకాల సమాచారాన్ని ఒక సమగ్ర పుస్తక రూపంలో రూపొందించి అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

ఈ పుస్తకం ద్వారా మహిళలు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన పొందడంతో పాటు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మహిళా సంఘాల అభివృద్ధి, జీవనోపాధి కార్యక్రమాల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి మహిళా సంఘాలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశం ద్వారా మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ మరియు ప్రభుత్వ పథకాల సమర్థ వినియోగానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, LDM వీరన్న ,

ఏ డి జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, హార్టికల్చర్ అధికారి హేమలత ,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కందుకూరి రేణుక, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి రచ్చ పల్లవి, కోశాధికారి అలివేలు, జిల్లాలోని అన్ని మండల మహిళా సమాఖ్యల అధ్యక్షులు, ప్రతినిధులు మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు

# సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అవకాశం

**బెల్లంపల్లి ఏరియా జిఎం రమేష్**

బెల్లంపల్లి మహా :మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయ్యాయని సింగరేణి ఉద్యోగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం శ్రీ రమేష్ గురువారం తెలిపారు.కళాశాలలో సింగరేణి ఉద్యోగుల వారసుల కోసం ప్రత్యేకంగా 150 సీట్లు అందుబాటులో ఉన్నాయని అందులో సివిల్ ఇంజినీరింగ్ 30, కంప్యూటర్ సైన్స్ 30 ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ 30 ,మెకానికల్ ఇంజినీరింగ్ 30 ,మైనింగ్ 30 సీట్లు ఉన్నాయని అన్నారు. ఈ 150 సీట్లలో ప్రవేశం పొందేందుకు సింగరేణి వారసులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సులో చేరేందుకు సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ నెల 8 వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.మరిన్ని వివరాలకు https://scp.scpolytechnic.com/counseling/ వెబ్ సైట్ లేదా 8790112515, 9908151618, 9010222161 నెంబర్లను సంప్రదించాల్సిందిగా జిఎం కోరారు.

# థాయ్‌లాండ్ - హైదరాబాద్ డ్రగ్స్ లింక్ బట్టబయలు

**హైదరాబాద్, మహా.** భాగ్యనగరం వేదికగా నడుస్తున్న అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా డొంక కదులుతోంది. థాయ్‌లాండ్ కేంద్రంగా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ. 12 కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి రాకెట్‌లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. తెలంగాణ 'ఈగల్' పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఈ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయింది. కేవలం మత్తు పదార్థాల పట్టివేతకే పరిమితం కాకుండా, ఈ దందా వెనుక ఉన్న భారీ నెట్‌వర్క్‌ను దర్యాప్తు సంస్థలు పక్కాగా ఛేదించాయి.

పోలీసుల లోతైన దర్యాప్తులో ఊహించని నిజాలు బయటపడ్డాయి. థాయ్‌లాండ్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలించేందుకు ఈ స్మగ్లింగ్ ముఠా ఏకంగా 300 మందికి పైగా క్యారియర్లను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. విమానాశ్రయాలు, ఇతర రవాణా మార్గాల్లోని భద్రతా వ్యవస్థల కళ్లుగప్పి, అత్యంత సులువుగా ఈ మత్తు పదార్థాలను నగరానికి చేరవేసేందుకు వీరంతా ఒక పకడ్బందీ వ్యవస్థగా పనిచేస్తున్నట్లు నిర్ధారించారు. ఒక్కొక్క క్యారియర్ ద్వారా అత్యంత రహస్యంగా డ్రగ్స్‌ను తరలిస్తూ, ఇక్కడ స్థానికంగా ఉన్న ఏజెంట్లకు, పెడ్లర్లకు అప్పగించేలా ఈ అక్రమ నెట్‌వర్క్‌ను డిజైన్ చేశారు.

నెల రోజుల పాటు నిరంతర నిఘా, పక్కా టెక్నికల్ ఇంటెలిజెన్స్‌తో 'ఈగల్' టీమ్ ఈ ముఠా కదలికలను ట్రాక్ చేసింది. ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే సూత్రధారిగా భావిస్తున్న ఒక విదేశీ మహిళ సహా పది మంది డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసిన పోలీసులు, వారి ద్వారా ఈ 300 మంది క్యారియర్ల వివరాలను రాబట్టినట్లు సమాచారం. నగరంలోని యువతను, విద్యార్థులను, ఐటీ ఉద్యోగులను ప్రధానంగా టార్గెట్ చేస్తూ భారీ ఎత్తున మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ఈ సిండికేట్ మూలాలను పెకిలించేందుకు అధికారులు తమ దర్యాప్తును ఉద్ధృతం చేశారు.

ప్రస్తుతం అరెస్టయిన నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించడం ద్వారా ఈ 300 మంది క్యారియర్లు ఎవరు, వీరికి స్థానికంగా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి, డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులు ఎవరు అనే కోణంలో పోలీసులు ముమ్మరంగా కూపీ లాగుతున్నారు. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టేందుకు ఈగల్ బృందాలు సిద్ధమయ్యాయి. ఈ కేసు విచారణ కొనసాగుతున్న కొద్దీ రాబోయే రోజుల్లో మరిన్ని సంచలనాత్మక అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది.



# మీనాక్షి నటరాజన్ కు రాజ్యసభ

- **మధ్యప్రదేశ్ నుండి ప్రకటించిన హైకమాండ్**
- **షర్మిలకు నో ఛాన్స్**

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కు రాజ్యసభ ఛాన్స్ దక్కింది. ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ నుండి కాంగ్రెస్ హైకమాండ్ ఎంపిక చేసింది. తెలంగాణ ఇన్ ఛార్జిలుగా వచ్చిన వారికి ప్రమోషన్ రావడం పరిపాటిగా మారింది. తెలంగాణ కో ఇన్ ఛార్జిలుగా పని చేసిన ముగ్గురు ఇటీవల కాలంలో మంత్రులయ్యారు. కర్నాటక నుండి ఖర్గే, పవన్ ఖేరా, మన్సూర్ అలీఖాన్ లను ఎంపిక చేయగా, షర్మిలకు ఛాన్స్ మిస్ అయింది. పవన్ ఖేరాను మొదట జార్ఖండ్ నుండి పంపాలని భావించినా, స్థానిక సమీకరణాలతో కర్నాటకకు తీసుకురావాల్సి వచ్చింది. దీంతో ఏఐసీసీ కోటాలో పవన్ ఖేరా దక్కించుకున్నారు. తమిళనాడు నుండి టీవీకేతో పొత్తులో కీలకమైన ప్రవీణ్ చక్రవర్తిని ఎంపిక చేశారు.

# కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

**10 రోజుల్లో రాష్ట్రానికి**
**ఐఎండీ బిగ్ అప్డేట్..!**

హైదరాబాద్, మహా : వేసవి తాపంతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు చల్లటి వార్త. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఇవాళ కేరళను తాకాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ అధికారికంగా నిర్ధారించింది. దీంతో కేరళలో భారీ వర్షాలు ప్రారంభమయ్యాయి. మరికొద్ది రోజుల్లోనే ఇవి క్రమంగా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు విస్తరించబోతున్నాయి. జూన్ రెండో వారంలో ఏపీ, తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. కేరళలో నైరుతి రుతుపవనాలు ఇవాళ ప్రవేశించాయి. దీంతో వర్షాకాలం (జూన్ సెప్టెంబర్) ప్రారంభమైనట్లయింది. సాధారణంగా జూన్ 1వ తేదీన వచ్చే రుతుపవనాలు ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా వచ్చాయి. వీటి ప్రభావంతో వచ్చే వారం కేరళలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. కేరళ నుంచి రుతుపవనాలు ఉత్తరం వైపు తెలంగాణలోకి ప్రయాణించడానికి సుమారు వారం సమయం పడుతుందని అంచనా. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గడం ప్రారంభమయ్యాయని పేర్కొంటూ, తెలంగాణ వ్యాప్తంగా వడగాలుల హెచ్చరికలను ఉపసంహరించుకుంటున్నట్లు ఐఎమ్‌డి నిన్న ప్రకటించింది. ఇప్పుడు నైరుతి రుతుపవనాలు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు, గోవా మొత్తానికి, మహారాష్ట్ర, అలాగే ఏపీలోని కొన్ని భాగాలకు మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. రాబోయే రెండు మూడు రోజుల్లో రుతుపవనాలు కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు, తమిళనాడులోని మిగిలిన ప్రాంతాలకు, నైరుతి బంగాళాఖాతానికి, పశ్చిమ మధ్య, తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు, ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలకు కూడా విస్తరిస్తాయని ఐఎండీ తెలిపింది.







# సీబీఎస్ఈ మూల్యాంకన వివాదం.

- **ఛైర్మన్, సెక్రటరీపై కేంద్రం వేటు.**
- **అవకతవకలు, భద్రతా లోపాలపై కొరడా.**
- **ఛైర్మన్‌గా ప్రశాంత్ సీతారామ్ నియామకం.**

**ఢిల్లీ, మహా :**

సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో తలెత్తిన తీవ్ర వివాదాలు, భద్రతా వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంలో కఠిన చర్యలు చేపడుతూ ఉన్నతాధికారులను బదిలీ చేయడంతో పాటు సమగ్ర విచారణకు ఆదేశించింది. టెండర్ల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, సిస్టమ్‌లో భద్రతా లోపాల నేపథ్యంలో సీబీఎస్ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్, కార్యదర్శి హిమాన్షు గుప్తాలపై కేంద్రం బదిలీ వేటు వేసింది. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖలో అదనపు సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీనియర్ అధికారి లోఖండే ప్రశాంత్ సీతారామ్‌ను సీబీఎస్ఈ కొత్త ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఓ ఎస్ ఎం ప్రక్రియ నిర్వహణ కోసం హైదరాబాద్‌కు చెందిన 'కోఎంప్ట్ ఎడ్యుటెక్' సంస్థను ఎంపిక చేసిన విధానం, అందులో జరిగిన నిబంధనల ఉల్లంఘన, పోర్టల్ లోపాలపై లోతైన దర్యాప్తు చేయడానికి కేంద్రం ఉపక్రమించింది. ఇందుకోసం ఎస్. రాధామోహన్ నేతృత్వంలో ఒక ఏకసభ్య విచారణ కమిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

మరోవైపు, విద్యార్థుల రీవ్యాల్యుయేషన్, రీవెరిఫికేషన్ కోసం కేంద్రం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన పోర్టల్‌పై భారీ స్థాయిలో సైబర్ దాడులకు యత్నం జరగడం కలకలం రేపింది. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే పోర్టల్‌పై 15 లక్షలకు పైగా హిట్స్ రాగా, విలువైన డేటాను తస్కరించేందుకు లక్షకు పైగా అనధికారిక ప్రయత్నాలు జరిగాయి. అయితే, అప్రమత్తమైన అధికారులు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు. ఇదిలా ఉండగా, విద్యార్థులు తమ లేదా కుటుంబ సభ్యుల ఆధార్‌తో లాగిన్ అయ్యి జూన్ 6వ తేదీ అర్ధరాత్రి వరకు రీవ్యాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. జవాబు పత్రాల లోపాల పరిశీలనకు రూ.100, పునర్మూల్యాంకనం కోసం ఒక్కో ప్రశ్నకు రూ.25 చొప్పున ఫీజుగా నిర్ణయించారు.

ఈ మొత్తం వివాదంలో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. జార్ఖండ్‌కు చెందిన 17 ఏళ్ల విద్యార్థి సార్థక్ సిద్ధాంత్.. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ విద్యా సంబంధిత స్థాయీ సంఘం ముందు హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. సీబీఎస్ఈ టెండర్ల అవకతవకలపై ఆ విద్యార్థి ఏకంగా 7 పేజీల నివేదికతో కమిటీకి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థి లేవనెత్తిన అంశాలపై తీవ్రంగా స్పందించిన పార్లమెంటరీ కమిటీ.. ఈ వ్యవహారంపై తక్షణమే పూర్తి వివరణ ఇవ్వాల్సిందిగా సీబీఎస్ఈ అధికారులను ఆదేశించింది.


# హైదరాబాద్ శివారులో భూముల విలువ బాగా పెరుగుతోంది

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచలేదు
ఏ శాఖ కేటాయించినా మనస్ఫూర్తిగా పనిచేస్తా
శాఖల మార్పు ప్రచారం పై పొంగులేటి రియాక్షన్

**హైదరాబాద్, మహా :** మంత్రుల శాఖల మార్పుపై వస్తున్న వార్తలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. తాను ఓ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, ముఖ్యమంత్రి తనకు ఏ శాఖ కేటాయించినా మనస్ఫూర్తిగా పనిచేస్తానని చెప్పారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని.. ఏ ఫైల్‌పైనా గుడ్డిగా సంతకం పెట్టలేదన్నారు. అంతా చట్టప్రకారమే చేసుకుంటూ వెళ్తున్నానని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తనపై ప్రేమ ఎక్కువని, అందుకే పదే పదే తనను టార్గెట్ చేస్తూ 'హగ్గింగ్' చేస్తుంటారని పొంగులేటి సెటైర్లు వేశారు.

**రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచలేదు**

గ్రేటర్ హైదరాబాద్ శివార్లలో భూముల విలువ విపరీతంగా పెరుగుతోందని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ల్యాండ్ వ్యాల్యూ మాత్రమే పెంచుతున్నామని, 'రిజిస్ట్రేషన్ వ్యాల్యూ' పెంచడం లేదని క్లారిటీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ వ్యాల్యూ గనుక పెంచితే.. భవిష్యత్తులో ప్రభుత్వం మళ్లీ భూసేకరణ చేయాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడుతుందని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏసీబీ కేసులకు సంబంధించిన ఫైళ్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 3 నెలల్లోనే ఏకంగా 3,500 పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసిందని వెల్లడించారు



# పవన్ సభకు అనుమతిస్తే ఏమైతుండే

- **మరోసారి సెంటిమెంట్ రాజకీయాలకు తెరలేపిన బీఆర్ఎస్, కాంగ్రెస్**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుంది..? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. తెలంగాణకు వ్యతిరేకంగా పవన్ ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ లో మాట్లాడిన రాంచందర్ రావు తెలంగాణ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా లవైఫల్యం చెందాయని, ఈ వైఫల్యాలపై ప్రజల నుంచి విమర్శలు రాకుండా ఉండేందుకే తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని అధికారంలోకి రాగానే బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు దగ్గరకు తీసుకున్నాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా తెలంగాణను వ్యతిరేకించలేదా కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. ఉ్యమకారులపై లాఠీలతో దాడి చేసిన వారికి ఇప్పుడు ఎందుకు ప్రాధాన్యమిస్తున్నారో కాంగ్రెస్ ప్రజలకు వివరించాలన్నారు.

పవన్ కల్యాణ్ జనసేన సభ కోసం అనుమతి అడిగారని, ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని, సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని ఎందుకు అడ్డుకున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.కాంగ్రెస్ సర్కార్ స్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. బీజేపీ ఎవరితోనూ కలిసి వెళ్ళదని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇస్తామని, పదవులు ఎవరికి ఎప్పుడు రావాలో అప్పుడు వస్తాయన్నారు.

# "కాలం చేస్తున్న హెచ్చరిక"

**– ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం**



ప్రకృతి సంకేతాలను మనిషి ఎంతకాలం నిర్లక్ష్యం చేయగలడు? భూమి వేడెక్కుతోంది. వర్షాల తీరు మారుతోంది. కరువులు, వరదలు, అరణ్యాగ్నులు, తుఫాన్లు తరచుగా విరుచుకుపడుతున్నాయి. అయినప్పటికీ అభివృద్ధి పేరుతో సహజ వనరుల దోపిడీ మాత్రం ఆగడం లేదు. గాలి, నీరు, నేల, అడవులు, జీవవైవిధ్యం వంటి ప్రకృతి ప్రసాదాలపైనే మానవ నాగరికత ఆధారపడి ఉన్నప్పటికీ, నేడు అదే ప్రకృతిని ప్రమాదంలోకి నెడుతున్నది మనిషే. వాతావరణ మార్పులు ఇక శాస్త్రవేత్తల హెచ్చరికల్లో మాత్రమే లేవు; అవి ప్రపంచ ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవాలుగా మారాయి. ఇలాంటి ఆందోళనకర పరిస్థితుల్లో జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమం మాత్రమే కాదు ఆలస్యమైతే చెల్లించాల్సిన మూల్యం ఎంత భారీగా ఉంటుందో గుర్తుచేసే హెచ్చరిక.

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి "#NowForClimate" అనే థీమ్‌ను ఎంచుకోవడం వెనుక ఉన్న సందేశం అత్యంత గంభీరమైనది. వాతావరణ మార్పుల ప్రభావాలు కళ్లముందే కనిపిస్తున్నప్పటికీ ప్రపంచం ఇంకా చర్చలు, సమావేశాలు, ప్రకటనలకే పరిమితమవుతోంది. కానీ పరిస్థితి ఇప్పుడు ఆ స్థాయిని దాటిపోయింది. రేపటి గురించి ఆలోచించే సమయం కాదు, ఇప్పుడే చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ఈ థీమ్ ప్రపంచ దేశాలకు స్పష్టంగా చెబుతోంది.

వాతావరణ మార్పులు నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలోని అనేక దేశాలు తీవ్ర ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాయి. ఒకవైపు వడగాలులు ప్రాణాలు తీస్తుండగా, మరోవైపు భారీ వర్షాలు, వరదలు కోట్లాది మందిని నిరాశ్రయులను చేస్తున్నాయి. హిమాలయ ప్రాంతాల్లో హిమనదాలు వేగంగా కరుగుతున్నాయి. ధ్రువ ప్రాంతాల్లో మంచు కరుగుదల సముద్ర మట్టాలను పెంచుతోంది. ఈ పరిణామాలు కేవలం ప్రకృతి వ్యవస్థలకే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి.

వాతావరణ మార్పులను చాలామంది పర్యావరణ సమస్యగా మాత్రమే చూస్తారు. కానీ అది అంతకంటే చాలా పెద్ద సమస్య. రైతు పంట దిగుబడుల నుంచి తాగునీటి లభ్యత వరకు, ప్రజల ఆరోగ్యం నుంచి దేశాల ఆర్థికాభివృద్ధి వరకు ప్రతి అంశంపై దీని ప్రభావం పడుతోంది. కరువు వల్ల పంటలు దెబ్బతింటే ఆహార ధరలు పెరుగుతాయి. వరదలు వస్తే మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతాయి. అధిక ఉష్ణోగ్రతలు ఆరోగ్య సమస్యలను పెంచుతాయి. అంటే వాతావరణ సంక్షోభం ఒకేసారి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య, ఆహార భద్రత సమస్యగా మారుతోంది.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం ప్రకృతిపై మానవుడి అత్యాశ. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వినియోగవాదం పేరుతో అడవులను నరికివేయడం, నదులను కలుషితం చేయడం, భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించడం, చెరువులను ఆక్రమించడం వంటి చర్యలు ప్రకృతి సమతుల్యతను దెబ్బతీశాయి. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ ప్రకృతిని నాశనం చేస్తూ సాధించే అభివృద్ధి చివరికి మానవాళికే ప్రమాదకరంగా మారుతుంది.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ సవాలు మరింత క్లిష్టమైనది. ఉపాధి అవకాశాలు పెంచాలి, పరిశ్రమలు తీసుకురావాలి, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలి. అదే సమయంలో సహజ వనరులను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే నిజమైన అభివృద్ధి. అందుకే స్థిరమైన అభివృద్ధి (సస్టైనబుల్ డెవలప్‌మెంట్) అనే భావనకు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతోంది. పునరుత్పాదక ఇంధన వనరులు, సౌర శక్తి, గ్రీన్ టెక్నాలజీలు, నీటి సంరక్షణ వంటి చర్యలు ఈ దిశగా ఆశాజనక మార్గాలను చూపుతున్నాయి.

నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య ప్లాస్టిక్ కాలుష్యం. వినియోగం తర్వాత నిర్లక్ష్యంగా పారవేసే ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిని, నదులను, సముద్రాలను కలుషితం చేస్తున్నాయి. సముద్ర జీవులను నాశనం చేస్తున్నాయి. సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు ఆహార గొలుసులోకి ప్రవేశించి మానవ ఆరోగ్యానికీ ముప్పుగా మారుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాకపోయినా, దానిని గణనీయంగా తగ్గించడం అత్యవసరం.

నీటి వనరుల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు కనుమరుగవుతున్నాయి. వర్షపు నీటిని నిల్వ చేసుకునే సంప్రదాయ వ్యవస్థలు బలహీనపడిపోయాయి. భవిష్యత్తులో నీటి కోసం ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల నీటి సంరక్షణను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది.


తెలంగాణలో చేపట్టిన హరితహారం, చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణలో కొంత మేర సానుకూల ఫలితాలు ఇస్తున్నాయి. రాష్ట్రంలో పచ్చదనం పెంచడం, జలవనరులను సంరక్షించడం వంటి చర్యలు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవగలవు. అయితే ప్రభుత్వాలు ఎంత కృషి చేసినా ప్రజల భాగస్వామ్యం లేకుండా పర్యావరణ పరిరక్షణ సాధ్యం కాదు.

అసలు మార్పు వ్యక్తి స్థాయిలోనే ప్రారంభం కావాలి. ప్రతి పౌరుడు ఒక చెట్టు నాటడం, నీటిని వృథా చేయకుండా చూడడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం వంటి చిన్నచిన్న చర్యలు తీసుకుంటే వాటి ప్రభావం సమాజంపై ఎంతో పెద్దదిగా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వాలకే వదిలేయాల్సిన బాధ్యత కాదు. అది ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి జీవనశైలిలో భాగం కావాలి.

యువత పాత్ర ఈ విషయంలో అత్యంత కీలకం. పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణ విద్యకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యత, సంరక్షణ భావన చిన్న వయసులోనే అలవడాలి. నేటి విద్యార్థులే రేపటి పాలకులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల నాయకులు. వారికి ప్రకృతి విలువ తెలిసినప్పుడే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ప్రపంచాన్ని అందించగలుగుతాం.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే. ప్రకృతిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే. చెట్లను పెంచడం, నీటిని సంరక్షించడం, కాలుష్యాన్ని తగ్గించడం, జీవవైవిధ్యాన్ని రక్షించడం ద్వారా మాత్రమే భావితరాలకు నివాసయోగ్యమైన భూమిని అందించగలం.

మొత్తంగా "#NowForClimate" అనేది ఒక నినాదం కాదు కాలం చేస్తున్న హెచ్చరిక. వాతావరణ మార్పుల ప్రభావాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా కనిపిస్తున్న వేళ ఇక ఆలస్యం చేసే పరిస్థితి లేదు. పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వాల బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించాల్సిన అవసరం ఉంది. ప్రకృతిని కాపాడటం అంటే అభివృద్ధికి అడ్డుకట్ట వేయడం కాదు స్థిరమైన అభివృద్ధికి బాటలు వేయడం. భూమి మనకు వారసత్వంగా వచ్చిన ఆస్తి కాదు.. మన పిల్లలకు అప్పగించాల్సిన బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో నిర్లక్ష్యానికి ఇక అవకాశం లేదు.



అమరవాజి నాగరాజు
జర్నలిస్ట్

# కోదండరాంను కేబినెట్ లోకి తీసుకోవాలి



తెలంగాణ మూల సిద్ధాంతాల ఫలవంతానికై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త మంత్రిత్వ శాఖను పరిచయంలోకి తేవాలి. తన క్యాబినెట్ లోకి తీసుకోవడం ద్వారా ఆ శాఖను ఆచార్య కోదండరామ్ కు అప్పగించాలి. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ జోలికి పోవడం అనేది తేనె తుట్టెను కదిపినట్టుగా సీఎం రేవంత్ రెడ్డి, అధికార కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఏమాత్రం జడుసుకోవద్దు. నిజానికి దీనినో సావకాశ సాధనకు అస్త్రంగా మలుచుకోవాలి. మన భాష, మన భావనలు తెలుగు రాని, తెలంగాణ యాస తెలియని గాంధీ త్రయం సోనియా, రాహుల్, ప్రియాంక ఇక్కడి స్థితిగతులు ఉన్నవి ఉన్నట్లు గ్రహించడంలో స్వచ్ఛత, నాణ్యత ఎంతో ఆ హస్తినకే ఎరుక. మంత్రి మండలిలో తన సహచరుల ఎంపిక కంప్లీట్ గా ముఖ్యమంత్రి విచక్షణాధికారం. కాంగ్రెస్ జాతీయ పార్టీ కాబట్టి, ఆ పార్టీకి హై కమాండ్ ఉంటుంది కాబట్టి ముఖ్యమంత్రికి, ఆ హైకమాండ్ కు మధ్య సమన్వయం, ఏకాభిప్రాయం మినిస్టర్ల సెలక్షన్ లో తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వాధిపతిగా రేవంత్ ప్రతిపాదనలు, సిఫార్సులు, అంతరంగం, అభీష్టమే అంతిమ నిర్ణయం కాకపోయినా కాంగ్రెస్ అధిష్ఠానం తప్పకుండా పరిగణలోకి తీసుకోవాల్సిందే. ఎందుకంటే, తెలంగాణ పరిస్థితులు రేవంత్ రెడ్డికి అనుభవంలో ఉన్నంత యథాతథంగా ఢిల్లీలోని గాంధీ త్రయానికి ఉండకపోవచ్చు. తెలంగాణ రాష్ట్ర అవతరణలో మొదటి, రెండో పర్యాయాలు ఏలిన కేసీఆర్ పాలనా విధానాలు, తీరును తూర్పారబట్టే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి మొదటిసారి రాగలిగింది. నిష్ఠుర సత్యం ప్రకారమైతే


ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనా సేవలు సీఎం రేవంత్ ఉబలాటపడుతున్నట్టుగా 2034 దాకా అంటే ఇంకో టర్మ్‌కు ఏమాత్రం చాలవు. ఇంకా ఏదో చేయాలి. మరెంతో కష్టపడాలి. తదేక దీక్ష పూనాలి. నిజానికి రేవంత్ రెడ్డికంటే గొప్పగా పరిపాలన చేయగలమని ప్రస్తుతం ఆయన క్యాబినెట్ లో ఉన్న మంత్రులు కానీ, పార్టీ రాష్ట్ర అగ్ర నేతలు కానీ ఇప్పటివరకు యావత్ తెలంగాణ ప్రజల మెప్పు పొందేలా తమ సామర్థ్యాలను దృఢంగా రుజువు చేసుకోలేదు. సీఎం పీఠం కోసం కలలు కనడంలో, ఆశ పడడంలో మినహా పని రూపేణా చేతల్లో ఇంకెవ్వరూ రేవంత్ రెడ్డికి మించి పాటుపడడం లేదు. సూటిగా పేర్కొనాలంటే, రేవంత్ కు వాస్తవంలో ఇప్పటికైతే కాంగ్రెస్ పార్టీలో ఎవరూ పోటీ, సాటి లేరు. ఇంత అనుకూలమైన అదృష్టం తెలుగునాట కాంగ్రెస్ లో రాజశేఖరరెడ్డి తర్వాత రేవంత్ రెడ్డికి మాత్రమే దక్కుతున్నది. కాబట్టి, మంత్రి వర్గం వ్యవహారంలో సహేతుకమైన నిర్ణయం తీసుకుంటే అది సంచలనం అవడమే కాదు, తాను కోరుకుంటున్న మరోదఫా గమ్యానికి ఇరుసూ, ఇంధనమూ కావొచ్చు. మంత్రి పదవి కోసం సుమారు డజను మంది తీవ్రంగా పోటీ పడుతున్నారు. బెదిరిస్తున్నారు. ఆగ్రహిస్తున్నారు. ఆకాశానికి ఎత్తుతున్నారు. అసంతృప్తి చెందుతున్నారు. అలుగుతున్నారు. దూరంగా ఉంటూ నల్లపూసలు అవుతున్నారు. ఇరుకున పెట్టే వ్యాఖ్యానాలు దట్టిస్తున్నారు. ఇత్యాది భిన్న, వాటం తీరు వైఖరుల వారి వైపే ఎంతసేపూ చూడకుండా, బుర్ర వేడెక్కేలా ఆలోచించకుండా, వెనకా ముందూ ఊగిసలాటలతో ఏవేవో భయభ్రాంతులకు లోను అవకుండా సహేతుకమైన నిర్ణయమే తీసుకోవాలి. ప్రాక్టికల్ దృక్పథమే ఇందుకు ప్రామాణికం కావాలి. రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలకు కనీసం ఏదో ఒక లబ్ధి చేకూర్చిన కేసీఆర్ నే కాదనుకొని, రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీని తమ పాలక పక్షంగా జనం నెత్తిన మోస్తున్నారంటే, కేసీఆర్ కు మించిన గొప్ప సేవలు చేస్తారనే కదా. మరీ ముఖ్యంగా ఉద్యోగ నియామకాలకు ఆచరణ పూర్వక జాబ్ క్యాలెండర్, ఉద్యోగ లోకం ఆశలు, ఆకాంక్షలు, వ్యవసాయ, విద్య తదితర రంగాల్లో ప్రగతి, చరిత్రలోని సమగ్ర ఉద్యమకారులకు, వారి కుటుంబాలకు అనుభవంలో ఆదరణ వంటి మేనిఫెస్టోలోని తెలంగాణ తనపు అనేక అంశాల మూల అనుభూతి ప్రతి తెలంగాణ పౌరులలో కలుగజేయడం ఇంకా మిగిలే ఉన్నది. ఆ బాసల కూర్పులో మొత్తంగా తెలంగాణలోని ప్రజా పాలన ఫ్లేవర్ పరిమళించడం కోసం నిరీక్షణ కొనసాగుతోంది. అందువల్ల ఆ బాధ్యతలు నెరవేర్చేలా విడిగా, విధిగా ఒక మంత్రిత్వ శాఖను వైవిధ్యంగా, సృజనాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సృష్టించాలి. ఆ డిపార్ట్మెంటుపైనే ధ్యాస నిలిపేలా తన క్యాబినెట్ లోకి తటస్థ సామాజిక సేవకులను, సామాజిక వేత్తలను తీసుకోవడం ద్వారా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలి. తెలంగాణలోని మెజారిటీ వర్గాలు, సింహ భాగం ప్రజలు సంతోషంగా ఆమోదించే, అంగీకరించే, స్వాగతించే, విశ్వసించే వారినే అందుకు ఎంపిక చేయాలి. ఇందుకోసం ఆచార్య కోదండరాంను శీఘ్రంగా, చురుకుగా, సానుకూలంగా పరిశీలించాలి. మలి దశ తెలంగాణ ఉద్యమం సహా నేటి ప్రభుత్వంలోనూ సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ కోదండరాంకు సహనం, సంయమనం, వ్యవహారాలు చక్కదిద్దే నైపుణ్యం, విషయ పరిజ్ఞానం, భావోద్వేగాలు, ఉద్రిక్త మనస్తత్వానికి అతీతంగా స్థితప్రజ్ఞత, అధ్యయన సమర్థత, నిలకడ తత్వం, సూటిగా వ్యక్తీకరణ, ప్రభుత్వ యంత్రాంగంతో పని చేయించే మెలకువలు, అందరినీ కలుపుకొని పోయే మృధు భాషణ, ఆయా అంశాలపై లోతైన అవగాహన, వేర్వేరు తరాలనూ సంభాళించే సమయానుకూలత, విజ్ఞత, అదే పనిగా రొటీన్ రాజకీయాలకంటే తెలంగాణ కోసం తపన వంటివి ఎన్నో ఎక్స్ క్లూజివ్ కోణాలు కోదండరాంలో బోలెడు. తనను చాలా మటుకు సామాజిక వర్గం పరంగా ఎవరూ చూడరు. అన్ని కులాలు, మతాల వాళ్ళూ ఓన్ చేసుకుంటారు. సగటు నేతలతో నిమిత్తం లేకుండా తనకు తెలంగాణ సమాజంలోనూ, బయటా గౌరవ మర్యాదలు ఉన్నాయి. సాధారణ లీడర్లకు పొజిషన్ ఉన్నప్పుడే రెస్పెక్ట్. కానీ, ప్రొఫెసర్ కోదండరాం సార్ కు అట్లా కాదు. తనకు ఉండే మర్యాద పొజిషన్ తో అక్కెర లేకుండా ఎపుడూ ఉంటుంది. గిట్టని వారే అక్కడక్కడా తాను పిలిపించుకోని కుల చిహ్నం తగిలిస్తుంటారు. మంత్రి కావాలంటే ఏదో ఒక చట్ట సభలో సభ్యులై ఉండాలి. ఆల్రెడీ కోదండరాం శాసన మండలి సభ్యులు. కాబట్టి, అలవోకగా తనను తన క్యాబినెట్ సహచరుడిగా సీఎం రేవంత్ రెడ్డి నియమించుకోడానికి సానుకూల అంశాలు, విశేషాలు ఎన్నెన్నో ఉన్నాయి. కుల మతాల బ్యాలెన్స్ తో నిమిత్తం లేని ఎంపికా కాగలదు. పైగా ముఖ్యమంత్రిగా తనపై నేరుగా, ప్రభుత్వం మీదా ఒత్తిడి తగ్గుతుంది. కుడి భుజంలా ఒక గట్టి కార్యసాధకులు పాలనలో వెంట ఉన్నారనే ధైర్యం, దీమా రేవంత్ రెడ్డికి బోనస్ అవుతుంది. మంచి నిర్ణయంగా ప్రజలూ సంబురమై మెచ్చుకుంటారు. మంత్రి పదవుల పోటీ వీరులూ దాదాపు కిమ్మనరు. పార్టీలోనైనా, బయట సమాజంలోనైనా ఈ తెలివైన గమనం సజావుగా గమ్యానికి చేర్చగలదు. ఈ విప్లవాత్మక నిర్ణయమై ఢిల్లీలోని గాంధీ త్రయాన్నీ కన్విన్స్ చేసే సామర్థ్యం ఎలాగూ సీఎం రేవంత్ రెడ్డి సొంతమే!

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
హైదరాబాద్
9440850384

# తెలంగాణ ఎవరి జాగీర్ అనేటోళ్ల అర్హత ఏంది ?

ప్రజాస్వామ్యయుతంగా భారత రాజ్యాంగం ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం గడిచినా రాష్ట్ర ఏర్పాటుపై, ఇక్కడి ప్రజలపై సీమాంధ్ర రాజకీయ పార్టీల అక్కసు బయటపడుతూనే ఉంది. కోట్లాది ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్ష, వేలాది మంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణపై ఎందుకంత ద్వేషం..? ఇక్కడి వనరుల్ని ఇక్కడి భూమి పుత్రుల కంటే ఎక్కువగా అనుభవిస్తూ ఎందుకంత అహంభావం..? అదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజైనా జూన్ 2న, పన్నెండేళ్ళ తర్వాత నవనిర్మాణ మంటూ సభకు పర్మిషన్ ఇవ్వలేదంటూ గగ్గోలు పెట్టడం..ఇదే కదా ఆధిపత్య ధోరణి అంటే.

తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం ముట్టలేదన్న పవన్ కల్యాణ్ మాటల్ని ఇక్కడి ప్రజలు ఇంకా మరువలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాదు ప్రక్రియను తప్పు పట్టానంటూ మరొక వితండ వాదం.. ప్రక్రియ జరిగిందే భారత రాజ్యాంగం ప్రకారం కదా.. ఇందులో తప్పు ఎక్కడుందో మరి అతనికే తెలియాలి. విశ్లేషకుడు నాగేశ్వర్ రావుకు, పవన్ కల్యాణ్ కు మధ్య జరిగింది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదం, దానికి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకున్నది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సగటు పౌరుడి ప్రశ్న. భారత రాజ్యాంగం ప్రకారం ఎవరైనా పార్టీలు పెట్టి, ఎన్నికల్లో పోటీ చేయవచ్చు దానికి ఎవరూ అడ్డు పడరు. ఇక్కడి ప్రజలే ఓటు రూపంలో సరైన సమయంలో సరైన తీర్పు చెప్తారు. పవన్ కళ్యాణ్ ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్ లో చాలా విషయాలు మాట్లాడారు, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఉత్తరాది జాతీయ పార్టీలు అవి ఇక్కడ పోటీ చేయలేదా అంటూ, నిజమే కానీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా తెలంగాణ బిల్లుకు పార్లమెంట్లో తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. నాడు ఉద్యమ సమయంలో కనీసం తెలంగాణ యువత ఆత్మ బలిదానాలు చేసుకోవద్దని ఒక్కనాడన్న పవన్ ఇలా ప్రెస్ మీట్ పెట్టిన దాఖలాలు ఉన్నాయా..? తెలంగాణలో ఉన్న కొండగట్టు దేవాలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున నిధులు కేటాయించి దాన్ని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం అంటే సీమాంధ్ర పార్టీలకు/ నేతలకు తెలంగాణ పై ఉన్నది నిజమైన ప్రేమ, అభిమానం కాదని తేటతెల్లం అయ్యింది. ఇక్కడ సినీ మార్కెట్ ఉన్నది కాబట్టి ఇక్కడే సంపాదిస్తూ పన్ను మినహాయింపు కోసం కరోనా వచ్చినపుడు ఎంతో కొంత చేసిన సాయాన్ని కూడా గొప్పగా ప్రచారం చేసుకోవడం సగటు పవన్ కల్యాణ్ అభిమానికి కూడా నచ్చడం లేదు. తెలంగాణ ముమ్మాటికి ఇక్కడి ప్రజల జాగీరే.. ప్రజాకవి గూడ అంజన్న రాసిన "అయ్యోనివా..నువ్వు అవ్వోనివా.. ఇసంత రమ్మంటె ఇల్లంతా నాదంటవా.."? అన్న పాట యాదికి వస్తుంది. పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటల్లో కొంత నిజం లేక పోలేదు. ఉద్యమ పార్టీగా రాష్ట్రాన్ని మేమే తెచ్చినమని చెప్పుకున్న టీఆర్ఎస్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని బీఆర్ఎస్ పార్టీగా మారి ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రలో పార్టీ ఆఫీసులు ఓపెన్ చేసి గుణాత్మక మార్పు కోసం ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడం కరెక్ట్ అయితే, జనసేన తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తే తప్పు లేదు కదా.. ఇదివరకే 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలు కూడా పోటీ చేసి ఎమ్మెల్యే సీట్లను కూడా గెలుచుకున్నాయి కదా. మరి జనసేనను పోటీ చేయకుండా ఆపేదెవరు..? ఎందుకింత రాద్ధాంతం..?. గత ఎన్నికల్లో అక్కడక్కడా పోటీ చేసినపుడు ఎన్ని ఓట్లు వచ్చాయో కూడా మరచిపోతే ఎలా..?



హైదరాబాద్ శివార్లలో పవన్ కళ్యాణ్ చెరువును కబ్జా చేసినట్టు వస్తున్న ఆరోపణలు నిజమో, కాదో తేల్చాల్సిన బాధ్యత హైడ్రా పైన ఉన్నది. తెలిసో తెలియకో ఎఫ్ టీఎల్, బఫర్ జోన్, చెరువుకు ఆనుకుని ఉన్న భూముల్లో ఇండ్లు కొని, నివసిస్తున్న వారి ఇళ్లను నేలమట్టం చేసే హైడ్రా పవన్ కళ్యాణ్ వంటి సినీ, రాజకీయ నాయకుల విషయంలో మౌనంగా ఉంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ఏపీలో మూడో స్థానంలో ఉన్న పార్టీ, ఇక్కడ పోటీ చేస్తే మహా ఐతే ఆరో స్థానంలో ఉండొచ్చు, అక్కడ మూడు నుండి రెండు అటు నుంచి ఒకటికి చేరితే నమ్మి వెంట తిరిగిన కార్యకర్తలకు మేలు జరుగుతుంది కానీ, తెలంగాణ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయి జనసేనకు లేదన్నది క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవం. సీమాంధ్ర సెటిలర్ల కోసం ఎన్నికల్లో గెలవడానికి ఒకటి రెండు నియోజక వర్గాల్లో విగ్రహాలు పెట్టుకుంటే పర్వాలేదు కానీ అస్తిత్వ మనుగడను ప్రశార్థకం చేసేలా క్షుద్ర రాజకీయాలు చేసేది ఎవరైనా సరే తెలంగాణ సమాజం క్షమించదు. తెలంగాణ ప్రభుత్వం సీమాంధ్ర కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ఎంత తప్పో.. సీమాంధ్ర బడా హీరోల సినిమాలకు స్పెషల్ టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలకు పర్మిషన్లు ఇవ్వడం కూడా అంతే తప్పు. సినిమా బాగున్నా లేకున్నా అభిమానాన్ని టికెట్ రేట్ల రూపంలో చేసే దోపిడిని అరికట్టాల్సిన బాధ్యత కూడా ఇక్కడి ప్రభుత్వం మీదే ఉంటుంది.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని నాయకులు, ఈ రోజు ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిచి ఉండవచ్చు. "ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే ప్రాంతం నుండి తరమికొడతం, ప్రాంతం వాడే ద్రోహం చేయాలని చూస్తే ప్రాంతంలోనే పాతి పెడతం" అన్న ప్రజాకవి కాళోజీ మాటల్ని యావత్ తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదు. ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించి, రాజకీయ వలస పక్షుల్లా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పక్షాన చేరే వాళ్ళు పార్టీలకు అతీతంగా ప్రజల పక్షాన నిలబడకుంటే వాళ్లకు రాజకీయ భవిష్యత్ లేకుండా చేసే శక్తి ఇక్కడి ప్రజలకు ఉన్నది. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని చెప్తూనే, తెలివిగా ఇక్కడి నాయకులను, ప్రజల్ని వేరు చేసి ఇంకెన్నాళ్ళు ఈ ప్రత్యేక వాదమంటూ విభజించి పాలించే .. బ్రిటీష్ కాలం నాటి రాజకీయం చేయబోతే తెలుసుకోలేనంత అమాయకులు తెలంగాణలో ఎవరూ లేరు. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల అకృత్యాలకు, భూస్వాముల దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాటమైనా... ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన వివక్షకు వ్యతిరేకంగా ఉధృతమైన 1969 నాటి తొలిదశ జై తెలంగాణ ఉద్యమమైనా... సీమాంధ్ర వలస పాలనలో దశాబ్దాలుగా నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయాలపై, స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా సాగిన 2009 మలిదశ తెలంగాణ ఉద్యమమైనా... అన్నీ స్వీయ అస్తిత్వం, ఆత్మగౌరవ పునాదులపైనే నిర్మితమయ్యాయి. ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వ మనుగడను ప్రశ్నార్థకం చేయాలని చూస్తే... గడ్డిపరకలు కూడా పోరాటానికి సై అంటూ గడ్డపారలవుతాయి.

ప్రముఖ కవి అందెశ్రీ మాటల్లో చెప్పాలంటే.."తెలంగాణ అంటే పిడికెడు మట్టి కాదు, ఇక్కడి ప్రజలు నిప్పుల వాగులో నివురుగప్పిన నిప్పు కణికలు" విద్వేషాన్నీ రాజేసే ప్రయత్నం చేసిన వారే దహనమైన ఘటనలు చరిత్రలో కోకొల్లలు.. తెలంగాణది ప్రాంతీయ వాదమని సీమాంధ్ర రాజకీయ పార్టీల నాయకులు తప్ప మరెవరూ అనరు. తెలంగాణది ప్రాంతీయ వాదం కాదు రాష్ట్ర వాదం అంటే జాతీయ వాదం. వందలాది ఏండ్ల క్రితం నుండే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఇక్కడి ప్రజలు కుల,మత, వర్గ భేదాలను పక్కన పెట్టి సోదరభావంతో జీవించే గొప్ప వాతావరణం ఇక్కడ ఉన్నది. అటువంటి తెలంగాణది జాతీయ వాదం అవుతుంది కానీ ప్రాంతీయ వాదమంటూ వక్రీకరించడం ఎందుకు..? పవన్ కల్యాణ్ అమితంగా ఇష్టపడే గద్దర్ కూడా ఇప్పుడు బ్రతికి ఉంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికేవాడేమో?.

వాస్తవానికి జాతీయ వాదంలోనే ప్రాంతీయ వాదం మిళితమై ఉంటుంది. అదే నిజమైన సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనం.భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్ స్పష్టం చేస్తోంది. నాడు ప్రాంతీయ వాదంతోనే కదా మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర విడిపోయింది..? నాడు ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడింది ప్రాంతీయ వాదం వల్లనే అని పవన్ అంగీకరించినట్లేనా..? విడిపోయిన తర్వాత కూడా చెన్నైలో తెలుగు వారున్నట్లే, హైదరాబాద్‌లో సీమాంధ్రులు, మార్వాడీలు, ఇతర రాష్ట్రాల నుండి జీవనోపాధి కోసం వచ్చిన వాళ్ళున్నారు. అంతా సఖ్యతగా ఉన్నప్పుడు, సీమాంధ్ర వలస పాలనలో అమరులైన వారి త్యాగాలను, ఉద్యమ జ్ఞాపకాలను స్మరించుకునే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించడం ముమ్మాటికి సరికాదు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో భాగస్వాములు కాబట్టి పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడినా సమర్థించే ఇక్కడి బీజేపీ నాయకుల తీరును కూడా తెలంగాణ యువత నిశితంగా గమనిస్తోంది. అధికార కాంగ్రెస్ అయినా, ప్రతిపక్ష బీఆర్ఎస్ అయినా ఇలాంటి సందర్భాల్లో తెలంగాణ ప్రజల పక్షాన గట్టిగా నిలబడాలి. అప్పుడే ప్రజా మద్దతుతో తిరిగి అధికారాన్ని చేపట్టే అవకాశం ఉంటుంది. తెలుగు వారికి ఇప్పుడు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాలూ సంక్షేమం, అభివృద్ధిలో పోటీ పడేలా పాలన అందించాల్సిన బాధ్యత ఇరు ప్రభుత్వాలపై ఉంది. రెండు రాష్ట్రాల్లో రెండు సార్లు ప్రభుత్వాలు మారాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలు గత పాలకుల వైఫల్యం వల్లే ఇదంతా.. అంటూ ఆరోపణలు చేయడం కంటే ప్రజలు ఐదేళ్లు అధికారాన్ని అందించినప్పుడు వీలైనంత మంచి చేసే ప్రయత్నం చేయాలి. అంతేకానీ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించవద్దు. విభజన చట్టం హామీలు, గోదావరి, కృష్ణానది జలాల వివాదాలు ఇంకా అలాగే ఉన్నాయి. నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ లేకపోవడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ఎన్నికలు వచ్చినపుడు హామీలు ఇవ్వడం, గెలిచిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాలన సాగడం శోచనీయం. ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయకుంటే అందరికీ మంచిది.


**యం.అర్జున్**
హైదరాబాద్



## పోలవరం ప్రభావిత ప్రాంతాలపై సమగ్ర సర్వే చేయాలి

**ముంపు బాధితుల సమస్యలు వివరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**బూర్గంపహాడ్, మహా :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ప్రభావితమవుతున్న ముంపు ప్రాంతాల సమస్యలను కేంద్ర జల సంఘం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఆయన కేంద్ర బృందంతో సమావేశమై సమగ్ర నివేదికను సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో నియోజకవర్గ పరిధిలోని బూర్గంపాడు మండలం సహా పలు ప్రభావిత ప్రాంతాలు వరద ముప్పును ఎదుర్కొంటున్నాయని వివరించారు. ముంపు వల్ల రైతులు, సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు.భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు తదితర ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక, భౌగోళిక పరిస్థితులపై కేంద్ర బృందంతో చర్చించి, ప్రభావిత ప్రాంతాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు.ముంపు బాధితులకు తగిన నష్టపరిహారం అందించడంతో పాటు, శాశ్వత పరిష్కారంగా కరకట్టల నిర్మాణం చేపట్టాలని, ముంపు ప్రభావిత ప్రజలకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.అలాగే, ముంపు ప్రాంతాల్లో నష్టపోతున్న ప్రతి కుటుంబానికి మెరుగైన పునరావాస ప్యాకేజీ ప్రకటించి, వారికి శాశ్వత పరిష్కారం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పోలవరం ప్రభావిత ప్రాంతాల సమస్యల పరిష్కారానికి తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.



## పోలవరం ప్రాజెక్టు అథారిటీ కమిటీకి వినతిపత్రం అందజేత

**బూర్గంపహాడ్, మహా :** పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంపుతో బూర్గంపహాడ్ గ్రామానికి పొంచి ఉన్న ముంపు ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు గురువారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారి సంజయ్ నందన్‌ను సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో బూర్గంపహాడ్ గ్రామంతో పాటు తెలంగాణలోని పలు గ్రామాలు ముంపు ముప్పును ఎదుర్కొంటున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ ప్రజల భవిష్యత్తు, ఆస్తులు, వ్యవసాయ భూములు, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని వివరించారు.దీనిపై స్పందించిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో తెలంగాణ ప్రాంతంలో ముంపుకు గురయ్యే అవకాశమున్న గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ద్వారా ప్రభావిత గ్రామాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించడంతో పాటు, ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, నివారణ చర్యలను కూడా నివేదికలో పొందుపరుస్తామని వెల్లడించారు.ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రభావిత గ్రామాల ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భజన పెదనాగం, తోకల శ్రీనివాస్‌తో పాటు అఖిల పక్ష నాయకులు, గ్రామ పెద్దలు లక్కోజి విష్ణువర్ధన్, కెవి రమణ, కైపు శ్రీనివాస్ రెడ్డి, గుద్దేటి ప్రవీణ్ కుమార్, వి.వి.బి చారి, ఆశిక్ దస్సీరాం పున్నంచంద్, హరినాథ్, గూడూరు వెంకన్న, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## ఇరవెండి ప్రత్యేక గ్రామసభలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**ప్రత్యేక గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ సీఈఓ నాగలక్ష్మి**

**బూర్గంపహాడ్, మహా :** గ్రామస్థుల సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఇరవెండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుండి బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పలు అంశాలపై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబాలకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వల్లూరుపల్లి వంశీకృష్ణ, ఏసీడీపీఓ, సీడీపీఓ, వ్యవసాయ శాఖ అధికారులు, వీఆర్వో, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, మిషన్ భగీరథ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చిస్తూ, గ్రామాభివృద్ధికి ప్రజలు-అధికారులు కలిసి పనిచేయాలనే సందేశంతో ప్రత్యేక గ్రామసభ విజయవంతంగా ముగిసింది.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య వైద్యం గ్రామీణాభివృద్ధి పర్యావరణ పరిరక్షణ పారిశుద్ధ్యం వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు డిజిటల్ విద్య మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రైతులు గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు అంతర్గత రహదారుల నిర్మాణం తాగునీటికి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డి ఆర్ డిఓ విద్యా చందన, మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పొత్తు లేకుండా గెలిచే సత్తా కూనంనేనికి ఉందా..?

- బిజెపి గురించి మాట్లాడే అర్హత సాంబశివరావుకి లేదు
- విలేకరుల సమావేశంలో బిజెపి అధ్యక్షులు బైరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి,** మహా:పొత్తు లేకుండా గెలిచే సత్తా కూనంనేనికి ఉందా..? అని బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

బిజెపి గురించి మాట్లాడే అర్హత సాంబశివరావుకి లేదని పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం సీటు కోసం పార్టీని తాకట్టు పెట్టిన వ్యక్తి బీజేపీ గురించి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. దమ్ముంటే రాజీనామా చేసి పోటీకి రావాలని సాంబశివరావుకు సవాల్ విసిరారు.

కమ్యూనిస్టు రాష్ట్రాలు కనుమరుగై బిజెపి జెండాలు ఎగిరాయని అన్నారు. కమ్యూనిస్టులకు రాజకీయ సన్యాసం ప్రజలు ఎప్పుడో ఇచ్చారని ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. రెండు సార్లు బూర్జువా పార్టీల అండతో ఎమ్మెల్యే అయిన సాంబశివరావుకు భారతీయ జనతా పార్టీ గురించి మాట్లాడే స్థాయి లేదని తీవ్రంగా విమర్శించారు. మొదటిసారి కొత్తగూడెం నియోజకవర్గంలో మహా కూటమి మద్దతుతో కేవలం 1500 ఓట్ల మెజారిటీతో కూనంనేని గెలిచారని, అనంతరం 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఐదో స్థానానికి పడిపోయారని అదే కమ్యూనిస్టులు బలమని ఎద్దేవా చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కమ్యూనిస్టు పార్టీ నైతికతను పక్కనపెట్టి ఓటుకు వెయ్యి నుంచి 1500 ఇచ్చి విజయం సాధించారని విమర్శించారు. ఎమ్మెల్యే కూనంనేనికి ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి చేయాలని అదే భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పోటీ చేస్తారని ఆయనపై గెలవగలరా అని ప్రశ్నించారు. జలగం వెంకట్రావు బిజెపి అభ్యర్థిగా ఓడిపోతే తాము రాజకీయ సన్యాసం చేస్తామని సవాల్ విసిరారు. కొత్తగూడెం కార్పొరేషన్ లో ఎన్నికల్లో కాంగ్రెస్ పై విమర్శలు చేస్తూ ప్రచారం చేసి మళ్ళీ అదే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మేయర్ పదవిని దక్కించుకున్న సిపిఐ పార్టీ నేతలు నియోజకవర్గంలో శాంతిభద్రత మంటగలుపుతున్నారని తీవ్రంగా విమర్శించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం గత ఎమ్మెల్యేల హయాంలో కోట్లాది రూపాయలు కేటాయించారని తిరిగి భగీరథ పైప్లైన్ కోసం ప్రభుత్వం రోడ్లు తవ్వుతూ ఆగమాగం చేస్తున్నారని ఆరోపించారు. కొత్త లైన్ లంటూ కమిషన్ కోసమే పనులు చేస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్పొరేటర్లకు ఎటువంటి గౌరవం లేదని చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు సైతం ఎమ్మెల్యేనే చూసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ పట్టుమని పది ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేసే స్థాయిలేని కమ్యూనిస్టు పార్టీ బిజెపిని విమర్శించడమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, పైడిపాటి రవీందర్, బిజెపి మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, జిల్లా కార్యదర్శి తుంపూరి శివ, సీనియర్ నాయకులు గుములాపురం సత్యనారాయణ, మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా నాయకులు, మండల స్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



## బాసర ఐఐటీకి మణుగూరు జడ్పీ విద్యార్థులు..

- పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ.. ఇద్దరికి క్యాంపస్ ఎంపిక
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు హెచ్ఎం నాగశ్రీ అభినందనలు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ (కోఎడ్యుకేషన్) పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర ఐఐటీ క్యాంపస్‌కు ఎంపికై పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు. 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గంజి జీష్మరమణిక 565 మార్కులు, జె. వికాస్ 563 మార్కులు సాధించి బాసర ఐఐటీ క్యాంపస్‌లో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. నాగశ్రీ గురువారం తెలిపారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులు పదో తరగతిలో విశిష్ట ప్రతిభ కనబర్చి బాసర ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం పొందడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను హెచ్ఎం నాగశ్రీ అభినందించారు. భవిష్యత్తులో కూడా పాఠశాల విద్యార్థులు విద్యా రంగంలో మరిన్ని విజయాలు సాధించి సంస్థకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆమె తెలిపారు.

## లా సెట్ లో ర్యాంక్ సాధించిన యశస్వి

**అభినందించిన గ్రామస్తులు**

జూలూరుపాడు, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఏపూరి నర్సింహారావు, జీవనజ్యోతి దంపతుల కుమార్తె ఏపూరి యశస్వి గురువారం ఎలువడిన లా సెట్ ఫలితాలలో 557వ ర్యాంక్ సాధించింది. లా సెట్ లో ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు వారి బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, యశస్విని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు, జన్మభూమి కి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు

**ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్**

గ్రామసభలో ప్రజలకు అవగాహన కల్పించిన డీసీపీ

మహా వరంగల్ బ్యూరో;వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గీసుగొండ మండలంలోని ఎల్కుర్తి హవేలీ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన ప్రజలకు రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు అసలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అంతేకాకుండా గ్రామాల్లో, వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవడం తద్వారా నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామునూర్ ఏసీపీ ఎన్. వెంకటేష్, గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్, ఎస్ఐ కె. కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్ దివ్యభారతి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఉపసర్పంచ్ నల్ల సురేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**



గీసుగొండ పోలీస్ స్టేషన్ ను ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీలు, వివిధ రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ చర్యల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రౌడీషీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని, కేడీ షీట్ హోల్డర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల పై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. బాధితుల ఫిర్యాదుల పై తక్షణమే స్పందించడం అలాగే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా స్టేషన్ అధికారి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశిత సమయం లోగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు పై డిసిపి అంకిత్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు.



## పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా

**మహా వరంగల్ బ్యూరో;**హనుమకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటుకు సంబంధించి భూమిని అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంచేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కీలకంగా మారుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. అలాగే పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగానే రాజుపేట సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణ అభివృద్ధికి,యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఏటీసీ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## ఆలేరులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ముగింపు సభలు

**ఆలేరు జూన్ 4 మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ 2వవార్డు, 3వార్డు లలో వార్డు సభలు నిర్వహించారు . ఈ వార్డు సభలలో ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్ 2026,జల్ సంచయ్ – జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట, మురికి కాలువల శుభ్రం చేయుట మరియు పూడిక తీయు పనులు,వర్షాకాల సంసిద్ధత పై కార్యాచరణ ప్రణాళిక, మంచి నీటి సరఫరా మరియు నిర్వహణ,నీరు నిలువ ప్రాంతాల నివారణ మరియు పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ మరియు వీది దీపాలు, మొక్కలు మరియు పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు మరియు ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి , కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి , 2వ వార్డు కౌన్సిలర్ వనరాశి మరియమ్మ , 3వ వార్డు కౌన్సిలర్ యాట శివ , మేనేజర్ జగన్ మోహన్ , మున్సిపల్ సిబ్బంది రాజు, బాబు & మెప్మా రిసోర్స్ పర్సన్ లు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో రోడ్డు కబ్జా
# విచారణకు డిమాండ్

- **యాప్రాల్–జవహర్‌నగర్ పానాది రహదారి ఆక్రమణపై ఆరోపణలు**
- **ప్రజలకు దక్కాల్సిన రహదారులు భూకబ్జాదారుల చేతుల్లో నుంచి విముక్తి కల్పించాలి**



**కుషాయిగూడ, మహా :** జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములు, పానాది రహదారులపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త కూతడి ముఖేష్‌కుమార్ డిమాండ్ చేశారు. యాప్రాల్ -జవహర్‌నగర్ మధ్య ఉన్న పానాది రహదారిని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించినట్లు తెలిపారు. సర్వే నంబర్లు 474, 475, 476, 501, 502 పరిధిలోని ప్రభుత్వ భూములు, రహదారి స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సర్వే నంబర్ 501లోని 20 గుంటల రహదారి స్థలం కబ్జా అయిందని ఆరోపించారు. యాప్రాల్ నుంచి జవహర్‌నగర్‌కు వెళ్లే ఈ రహదారిని పునరుద్ధరిస్తే ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. భూ ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే రహదారిని తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై త్వరలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

# పంట అవశేషాల కాల్చివేత పై నిషేధం

- **ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
- **జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ చాహత్ బాజ్‌పాయ్**



**మహా వరంగల్ బ్యూరో;**పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, నేల సారవంతత తగ్గిపోవడం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడటం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పంట వ్యర్థాల కాల్చివేతను తక్షణమే నిషేధిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.వ్యవసాయ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల హానికర వాయువులు వెలువడి వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం, మానవ జీవనం, రహదారి భద్రత మరియు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.అంతేకాకుండా భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణిస్తుందని తెలిపారు.

ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిఎన్ఎస్ 2023 సెక్షన్ 163 కింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలు, వ్యవసాయ భూములు, పొలాల్లో పంట అవశేషాల కాల్చివేతను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ 2023 సెక్షన్ 223 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉల్లంఘన వల్ల ప్రజలకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు లేదా మానవ ప్రాణాలకు ప్రమాదం కలిగితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట కోతల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.

**ముఖ్యంగా....**

పంట అవశేషాలను కాల్చడం అంటే భూమాతను, పర్యావరణాన్ని, మన భవిష్యత్తును కాల్చినట్టే. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి గ్రామం కాలుష్య రహితంగా, ప్రతి పొలం సారవంతంగా ఉండేలా అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.



# పెన్షన్ సమస్యలపై డీసీతో బొంతు శ్రీదేవి భేటీ

**లైవ్ అథెంటికేషన్ పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచన**

**కుషాయిగూడ, మహా :** పెన్షన్ల మంజూరు, పెండింగ్ దరఖాస్తులు, లబ్ధిదారుల సమస్యల పరిష్కారంపై కాప్రా మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ సాగర్‌తో బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం భేటీ అయ్యారు. కొత్త పెన్షన్ల మంజూరు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ల సకాల పంపిణీపై చర్చించి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డీసీ రవీందర్ సాగర్, పెండింగ్ సమస్యలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలో పెన్షన్లు పొందుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, చేనేత కార్మికులు, వికలాంగులు తప్పనిసరిగా లైవ్ అథెంటికేషన్ (ఫేస్ రికగ్నిజేషన్) పూర్తి చేయించుకోవాలని అధికారులు సూచించారు. గడువుకు మరో వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఆలస్యం చేయకుండా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. లేకపోతే పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడి గడపకు చేరేలా కృషి చేస్తామని బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పెన్షన్ విభాగం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్‌సీసీ దోహదం

**మాజీ మంత్రి ఏనుగాల పెద్ది రెడ్డి**
**విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాల పెంపునకు ఎన్‌సీసీ దోహదం**

: మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్‌నగర్‌లో ఉన్న చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఎన్‌సీసీ 7 (టి) గర్ల్స్ బెటాలియన్ వార్షిక శిక్షణా శిబిరం బుధవారం ఘనంగా ముగిసింది. మే 25 నుంచి జూన్ 3 వరకు పది రోజుల పాటు సాగిన ఈ శిబిరంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థినులు పాల్గొని క్రమశిక్షణ, నాయకత్వం, శారీరక దృఢత్వం, సామాజిక బాధ్యత తదితర అంశాలపై సమగ్ర శిక్షణ పొందారు. కల్నల్ సి.ఎస్. రావు, మేజర్ రేవతి ప్రభాకరన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో పరేడ్ శిక్షణ, ఆయుధాల నిర్వహణపై అవగాహన, వ్యక్తిత్వ వికాసం, విపత్తు నిర్వహణ, ప్రథమ చికిత్స, జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. శిబిరం ద్వారా విద్యార్థినుల్లో దేశభక్తి భావన, సేవా దృక్పథం, నాయకత్వ సామర్థ్యాలు పెంపొందించేలా అధికారులు కృషి చేశారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ పర్యాటక, పంచదార, కార్మిక మరియు ఉపాధి శాఖల మంత్రి ఏనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ, దేశ భవిష్యత్తును నిర్మించే యువతలో క్రమశిక్షణ, దేశసేవా భావన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

# పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

**వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో;**పంట మార్పిడి విధానాలను అనుసరించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడం తో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లావ్యాప్తంగా గురువారం 11 మండలాలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని, గ్రామ సభల్లో మన గ్రామం మన బాధ్యత చెత్తను వేరు చెయ్యండి ప్రకృతిని కాపాడండి అనే కాన్సెప్ట్ తో మనం ముందుకు వెళ్ళాలని ప్రతి గ్రామం అభివృద్ధి చెందినట్లు అయితే మండలాలు జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

గత ఏడాది జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం అధిక దిగుబడి సాధించడం సంతోషకరమన్నారు. ఈసారి రుతుపవనాల రాక ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, పత్తి వంటి పంటలను సాగు చేయాలని కోరారు.అధిక రసాయన ఎరువుల వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారుల సూచనలతో పాటు సంప్రదాయ సాగు పద్ధతులను కూడా అనుసరించాలని రైతులకు సూచించారు.

**ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రతి గ్రామంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**ఆడపిల్లల విద్య, ఆరోగ్యం పై దృష్టి**

మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత సమాజ అభివృద్ధికి కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణహిత శానిటరీ ప్యాడ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు.గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య పెరగడం ఆనందదాయకమని ఆమె తెలిపారు.

ఈ గ్రామ సభలో గ్రామ సర్పచ్ బొమ్మ పావని జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ బీఎండబ్ల్యూ రమేష్, సంబంధిత శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



# నాలా బాధితులకు పరమేశన్న భరోసా

**కమిషనర్‌తో భేటీ.. ఎవరికీ నష్టం జరగదని హామీ**

**కుషాయిగూడ, మహా:** ఉప్పల్‌లో నాలా విస్తరణ పనుల కారణంగా ఆందోళన చెందుతున్న బాధితులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అండగా నిలిచారు. కావేరినగర్ నుంచి నల్ల చెరువు వరకు నాలా ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి ఎస్ఎన్‌డీపీ కింద రూ.18 కోట్ల నిధులు మంజూరుకావడంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కావేరినగర్, న్యూ భారత్‌నగర్, హనుమాన్‌నగర్, సౌత్ స్వరూప్‌నగర్ తదితర కాలనీలకు చెందిన బాధితులు తమ సమస్యలను పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. గురువారం బాధితులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎన్‌డీపీ పనుల వల్ల ఏ ఒక్క కుటుంబానికీ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్, రిటర్నింగ్ వాల్ నిర్మాణంలో ఎవరి ఆస్తులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజల ప్రయోజనాలు కూడా పరిరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరగా, అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని పరమేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

# పార్టీ కోసం కష్టపడి పని చేయండి

**టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**మొయినాబాద్ మహా:** టిఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని రానున్నది.టిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు గురువారం మొయినాబాద్ మండలం మున్సిపాలిటీ లో గల ఎన్కేపల్లి,సజ్జన్‌పల్లి గ్రామాలకు చెందిన 20 మంది కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీ లకు చెందిన వారు టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, టిఆర్ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజు, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ ఇంచార్జి ఎండీ అన్వార్ ఖాన్,మండల ఇంచార్జ్ మేకగూడెం బిక్షపతి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను ప్రణంగంగా పెట్టి తెలంగాణను సాధించిన అమరవీరులను యాది చేసుకొని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్తున్నామని అన్నారు టిఆర్ఎస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి మంచి భవిష్యత్తు ఉంటుందని రానున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన ఉచిత విద్య,వైద్య,ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం పంచముఖిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని వారన్నారు పార్టీ కోసం కష్టపడి పని చేస్తామని మీడియాకు వెల్లడించారు

# అనంతారంలో ప్రత్యేక గ్రామసభ

- **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
- **మండల అభివృద్ధి అధికారి టి రవి**

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి అనంతారం గ్రామపంచాయతీ లోని క్రీడా మైదానంలో గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ అధ్యక్షతన గురువారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. మురుగునీటి నిలువలు, తడి, పొడి చెత్త వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. గ్రామంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, క్లోరినేషన్, మొక్కల పెంపకం, జలసమరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ పై పై తక్షణ చర్యలు చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. ఈ ప్రత్యేక గ్రామసభలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శైలజ, జిపిఓ నాగమణి, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, అనంతారం స్కూల్ టీచర్స్ శంకర్, నిర్మల, సుజాత, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శరన్, మిషన్ భగీరథ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, కరెంట్ లైన్ మెన్, అంగన్వాడి సూపర్వైజర్, టీఏ జోధాబాయి, ఏఎన్ఎం సావిత్రి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగమణి, గ్రామ దీపిక లక్ష్మీ, ఆశా ఝాన్సీ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# వ్యవసాయ శాఖ సూచనలను రైతులు పాటించాలి .!

- **రంగారెడ్డిజిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**
- **కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి**
- **యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలి: డీసీపీ నారాయణ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం జూన్ 4 మహా:** కర్ణంగూడ గ్రామంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం, కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు.

**పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం...**

వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.

కంపోస్ట్ వ్యర్థాలను, సేంద్రియ ఎరువుగా మార్చాలి.....

ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**రైతులకు ఎరువుల పంపిణీ సులభతరం...**

రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.


**అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలి...**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య...**

కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలి... గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించేలా చూసుకోవాలని కోరారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి, ఉపసర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, ఏసీపి కేపివీ రాజు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.









# శామీర్‌పేట్ సీఐ బదిలీ

**నరసింహారెడ్డి నియామకం**

**కుషాయిగూడ, మహా :** శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనాథ్‌ను బదిలీ చేస్తూ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆయన స్థానంలో నరసింహారెడ్డిని శామీర్‌పేట్ సీఐగా నియమించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల సీఐ శ్రీనాథ్‌పై పలు ఆరోపణలు సామాజిక మాధ్యమాలు మరియు స్థానిక వర్గాల్లో చర్చకు వచ్చిన నేపథ్యంలో ఈ బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. అలాగే సంబంధిత అంశాలపై పోలీస్ శాఖ నుంచి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పోలీస్ కమిషనరేట్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల మేరకు నూతన సీఐ నరసింహారెడ్డి త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి.



# సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు...

**క్రీడాకారులకు సర్టిఫికెట్లు పథకాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోనల్ ఆధ్వర్యంలో శంషాబాద్ పరిధిలో నెల రోజులపాటు సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026 లో గురువారం శంషాబాద్ జడ్పిహెచ్ఎస్ స్కూల్ గ్రౌండ్ లో సమ్మర్ క్యాంప్ ఘనంగా ముగింపు వేడుకలను నిర్వహించారు. శిబిరం ఏప్రిల్ 25 నుంచి మే 31 వరకు సమ్మర్ క్యాంప్ ను జిహెచ్ఎంసి అధికారులు విజయవంతంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ లో నిర్వహించిన వివిధ క్రీడాకారులకు సర్టిఫికెట్లు బహుమతులను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం పర్యవేక్షణలో జిహెచ్ఎంసి అధికారుల సంయుక్త పర్యవేక్షణలో తెలంగాణ రైజింగ్ 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా సమ్మర్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికితీశారు సమ్మర్ క్యాంప్ లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, పార్టీ నాయకులు జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్.

**పాలకుర్తి, జూన్ 4 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం, కొత్తపల్లి గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో నేరుగా మాట్లాడి, వారి పని పరిస్థితులను, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఎండల పట్ల అప్రమత్తం ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర ఎండల నేపథ్యంలో కూలీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పని వేళల్లో తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కూలీలు ఎండదెబ్బకు గురికాకుండా ఉండేందుకు వారికి టోపీలు, గ్లూకోవిటా ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం కూలీల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం అందుబాటులో ఉంటానని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మక్కన్ సింగ్ సేవ సమితి చైర్మన్ మనాలి ఠాకూర్, స్థానిక సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## గ్రామసభల వల్ల ఎన్నో ప్రయోజనాలు

- **ప్రజల సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**
- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** గ్రామ సభల వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం, రాపల్లి గ్రామపంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ఆయన, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ చేసినట్లు వెల్లడించారు.

ఈసారి వర్ష శాతం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా రైతులు అందుకు సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని ఆయన కోరారు. ఆ దిశగా జిల్లా రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా కావలసిన రైతులు యాప్ లో తమ పేర్లను పంట, సాగు వివరాలకు నమోదు చేసుకోవాలని ఆయన చెప్పారు.ఇలా నమోదు చేసుకున్న రైతులకు విడతల వారీగా యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని వివరించారు. ఈ పరిస్థితిని గమనించి రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. నానో యూరియా, డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని వెల్లడించారు.

భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని అన్నారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు డెంగ్యూ కేసులు నమోదు కాలేదని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని భరోసా పలికారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని అన్నారు. అందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని అన్నారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని వెల్లడించారు. అందుకు టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా..

**నిర్మల్ మహా:** నారాయణ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు యూనిఫామ్స్ లు బెల్టులు పెన్నుల కిట్స్ విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. గురువారం నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరిట యాజమాన్యం దోపిడీకి పాల్పడుతుందని అన్నారు. నారాయణ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా దృక్పథంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నారాయణ పాఠశాల ప్రాంగణాల్లోనే మార్కెట్ కంటే రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. .ముందస్తు అడ్మిషన్ల పేరిట వేల రూపాయల ఫీజులను అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న నారాయణ పాఠశాల విద్యా సంస్థలపై టాస్క్‌ఫోర్స్ కమిటీలతో తక్షణమే తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేసారు. దీంతో స్పందించిన ఎంఈవో నారాయణ పాఠశాల గదిని సీజ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దినేష్, సాయికుమార్,శివకుమార్, మున్నా, పవన్, కార్తీక్, అక్లేష్, సాయి అక్షయ్, రాంచరణ్, మాల్యాద్రి, శేషు, అశ్వంత్, రాజకుమార్, రాజేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్

**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం**
**ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్**



**పెద్దపల్లి జిల్లారామగుండం :** నియోజకవర్గం, పాలకుర్తి మండలంలోని గుడిపెల్లి మరియు వేమ్నూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఎమ్మెల్యే సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.కూలీలతో నేరుగా మాట్లాడిన మనాలి రాజ్ ఠాకూర్, పనుల అమలులో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆత్మీయంగా విన్నారు. ముఖ్యంగా పెండింగ్ వేతనాలు, చెల్లింపులకు సంబంధించిన అంశాలపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఇప్పటికే మాట్లాడామని, త్వరలోనే సానుకూల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ద్వారానే సమగ్రాభివృద్ధి : కలెక్టర్

- **వార్డు సభల ప్రారంభం**
- **45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో సభ**
- **దరఖాస్తులు అందించిన కాలనీవాసులు**



**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" ద్వారానే పట్టణాల్లోని ప్రతీ వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన హాజరయ్యారు. వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య సమస్యలను త్వరితగతిన గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలతో నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ అన్నారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన వారు వినియోగించుకునేలా అవగాహన కల్పించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యకచరణ ప్రణాళికను రచించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని అన్నారు.ఈ సందర్భంగా వచ్చే నాలుగు రోజుల పాటు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుంటు వాటి పరిష్కరానికి చర్యలు తీసుకోనున్నామన్నారు. తన 45వ వార్డులో చాలా మంది పేదలున్నారని, వారికి కనీసం పథకాల గురించి కూడా తెలియదన్నారు. ఇందిరమ్మ ఇండ్లను తన వార్డుకు ఎక్కువ కేటాయించేలా చూడాలని కోరారు. అదే విధంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటు దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారివారి శాఖల తరపున అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ చెత్త వేరు చేసే విధానం గురించి తెలియజేశారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలలో రెండవ బహుమతి పొందిన మునిసిపల్ చైర్ పర్సన్ కుమార్తె బండారి అమితకు కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఈఓ మాధవి, స్పెషల్ ఆఫీసర్ నిహారీక, హౌజింగ్ ఏఈ నజీర్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, ఎంఈఓ సోమయ్య, మెప్మా టీఎంసీ భాగ్యగలక్ష్మీ, ఇరిగేషన్ , ఎలక్ట్రిసిటీ అన్ని శాఖల అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## స్పెషల్ డైవ్



**ఆదిలాబాద్ మహా :** అక్రమ మద్యం తయారీ, విక్రయాలు రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని 11 పోలీస్ స్టేషన్ పరిధిలో 35 బృందాలచే నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గుడుంబా, బెల్లం వాష్, కల్తీ కల్లు మరియు ఇతర ముడి పదార్థాలను స్వాధీనం చేసుకుని 26 మంది పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 26 మందిపై కేసులు నమోదు చేసి, 32.5 లీటర్ల గుడుంబా, 35 లీటర్ల బెల్లం వాష్ అదనంగా 2 క్యాన్లు , 705 లీటర్ల కల్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.




## ఖేతీ బచావో'పై రైతులకు అవగాహన ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ సూచన

**బసంత్‌నగర్, జూన్ 04 మహా :** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్, ఈసాలతక్కలపల్లి మరియు ఎలకలపల్లి గ్రామాలలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని రైతులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు.వాతావరణ మార్పులపై అప్రమత్తత ఈ వానాకాలం 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం ఉండే అవకాశం ఉందని, దీనివల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ క్లిష్ట పరిస్థితులను తట్టుకునేలా రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి సాగులో తక్కువ రోజుల్లో చేతికొచ్చే స్వల్పకాలిక సన్నరకాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలని సూచించారు.సాగునీటిని పొదుపుగా వాడుకుంటూ అధిక లాభాలను ఇచ్చే పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటల సాగును పెంచాలని పిలుపునిచ్చారు, పొలాల్లో వరి కొయ్యకాళ్లు, ఇతర పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా వాయు కాలుష్యం పెరుగుతుందని, దీనికి బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని కోరారు.ఈ సమావేశాల్లో స్థానిక గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




## మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక బృందం

- **పోగోట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేయాలి**
- **రికవరీ చేసిన 330 మొబైల్ ఫోన్లు అందించిన ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ మహా:** ప్రజలు పోగొట్టుకున్న చోరీకి గురైన మొబైల్ ఫోన్లు తిరిగి రాబట్టడం కోసం ప్రత్యేక బృందాన్నిఏర్పాటు చేసినట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.గురువారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదాపు 66 లక్షల విలువ చేసే 330 మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు అందించారు. జిల్లాలో ఒక సంవత్సరంలో 1500 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి అందజేసినట్టు ఆయన తెలిపారు. మొబైల్ ఫోన్ పోయినా చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.లేదా దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలిపారు. రద్దీ ప్రాంతాలైన రైతు బజార్, బస్టాండ్, రైల్వే స్టేషన్, రిమ్స్ ప్రదేశాలలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి తిరిగి అందచేస్తామని హామీ ఇచ్చారు. దొంగలించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి పొందిన తర్వాత వాటి యజమానులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, ఎం ఎ రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్, నవనీత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి

- **గ్రామసభలో ఎమ్మెల్యే, కలెక్టర్ వెల్లడి**

**నిర్మల్ మహా:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ,నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.

గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంభించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు.ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు.అనంతరం ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ప్రయాణికునికి ఎబోలా లక్షణాలు...




**రాజేంద్రనగర్ మహా ;** ఆఫ్రికా దేశాలను గడగడలాడిస్తున్న ఎబోలా వైరస్ తెలంగాణలో ప్రవేశించింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ హిస్టరీ కలిగిన విదేశీ ప్రయాణికుడికి అధికారులు గుర్తించారు. గురువారం సూడన్ దేశం నుంచి వస్తున్న ప్రయాణికుడు మహమ్మద్ గతంలో ఎబోలా వైరస్ బారిన పడ్డాడని గుర్తించారు. శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ఏర్పాటుచేసిన స్కానర్ ద్వారా అతనికిఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నాయని గుర్తించి అతన్ని వెంటనే గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వార్డులోకి తరలించారు. నిర్ధారణ పరీక్షల కోసం అతడి శాంపిల్స్ను సిసి ఎంబికి పంపించారు. భారత ప్రభుత్వం అన్ని ఎయిర్పోర్ట్లో అలర్ట్ ప్రకటించింది. ఇతర దేశాల నుంచి వస్తున్న ప్రయాణికులను క్షుణ్ణంగా స్కానింగ్ చేసి ప్రయాణికులు బయటకి వదులుతున్నారు. ఎలాంటి అనుమానాలు కలిగిన వారిని గాంధీ ఆసుపత్రి లోని ప్రత్యేక వార్డుకు తరలిస్తున్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలోని గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి శివశంకర్ గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని అలాగే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వచ్చేది వర్షాకాలం కావడంతో రోగాల బారిన పడకుండా ఇంటి చుట్టుపక్కల పరిసరాల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిలిచే ప్రాంతాలలో వ్యర్థ పదార్థాలను వేయకూడదని వారు సూచించారు

## కాంబోడియాలో యూపీఐ చెల్లింపులు




**న్యూఢిల్లీ:** దేశీ ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) తాజాగా కాంబోడియాలో కూడా అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ సంస్థ కాంబోడియాకి చెందిన ఎక్లెడా బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం తొలి దశలో ఆ దేశంలో 45 లక్షల వ్యాపారులకు భారతీయ పర్యాటకులు క్యూఆర్ ఆధారంగా చెల్లింపులు చే యొచ్చు. తదుపరి దశలో కాంబోడియా పర్యాటకులు భారత్‌లో కూడా ఈ విధానంలో చెల్లింపులు జరిపే వెసులుబాటును వినియోగంలోకి తెస్తారు. ప్రస్తుతం సింగపూర్, ఫ్రాన్స్, నేపాల్ తదితర 8 దేశాల్లో యూపీఐకి అందుబాటులో ఉంది.

## జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో వాటా విక్రయం




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** విమానాశ్రయాల ఆపరేటర్ జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో జీక్యూజీ పార్ట్‌నర్స్ 1.8 శాతం వాటాను ఫిడిలిటీ ఇంటర్నేషనల్‌కి ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 1,906 కోట్లు. ఎన్‌ఎస్‌ఈలో బ్లాక్ డీల్ డేటా ప్రకారం జీక్యూజీ పార్ట్‌నర్స్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ ఫండ్ సగటున ఒక్కో షేరుకి రూ. 97.75 రేటు చొప్పున 19.50 కోట్ల షేర్లను విక్రయించింది. ఫిడిలిటీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ ఫిడిలిటీ ఇంటర్నేషనల్ స్మాల్ క్యాప్ ఫండ్ వీటిని కొనుగోలు చేసింది. జీఎంఆర్ గత ఆర్థిక సంవత్సరంలో తిరిగి లాభాల్లోకి మళ్లిన సంగతి తెలిసిందే.

# విదేశీ పెట్టుబడిదారులకు పన్ను ఉపశమనం!



### కరెన్సీ పతనానికి అడ్డుకట్ట

దేశీయ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న విదేశీ పెట్టుబడిదారుల (ఎఫ్‌పీఐ) నిష్క్రమణకు, రికార్డు స్థాయిలో పతనమవుతున్న రూపాయి విలువకు బ్రేకులు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కొన్ని వర్గాల సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడిదారులకు పన్ను నిబంధనలను సడలించేందుకు వీలుగా కేంద్ర కేబినెట్ కీలక ఆర్డినెన్స్‌ను సిఫారసు చేసింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదనకు ఆమోద ముద్ర పడటంతో త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ వెలువడనుంది. పశ్చిమాసియా యుద్ధం, అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిళ్ల నేపథ్యంలో దేశీయ మార్కెట్లను కాపాడుకునేందుకు ప్రభుత్వం వేసిన వ్యూహాత్మక అడుగు ఇది.

### రికార్డు స్థాయిలో నిధుల ఉపసంహరణ

ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయంగా పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 6 శాతం మేర బలహీనపడటం విధాన నిర్ణేతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి తోడు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) జనవరి నుంచి భారతీయ ఈక్విటీల నుంచి రికార్డు స్థాయిలో రూ.2.25 లక్షల కోట్లను ఉపసంహరించుకున్నారు. ఈ భారీ అవుట్‌ఫ్లోల కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి లోనవుతుండటంతో విదేశీ పెట్టుబడులను తిరిగి ఆకర్షించేందుకు పన్ను సడలింపులే ఏకైక మార్గమని ప్రభుత్వం భావించింది.


### ప్రధాన డిమాండ్లు

గత కొన్నేళ్లుగా ప్రభుత్వం దీర్ఘకాలిక (ఎల్‌టీసీజీ), స్వల్పకాలిక (ఎస్‌టీసీజీ) మూలధన లాభాల పన్నును పెంచడంతో పాటు సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)ను కూడా విధించింది. పన్ను నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ ద్వంద్వ పన్ను విధానం వల్ల అంతర్జాతీయ పెట్టుబడిదారులకు భారతదేశం అంతగా ఆకర్షణీయమైన మార్కెట్‌గా అనిపించడం లేదు. కేంద్ర బడ్జెట్‌కు ముందే ఎఫ్‌పీఐ ప్రతినిధులు ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లను ఉంచారు. లిస్టెడ్ సెక్యూరిటీల కోసం మూలధన లాభాల పన్ను విధానాన్ని పూర్తిగా సమీక్షించాలి. క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ రెండింటినీ కలిపి విధించడాన్ని నిలిపివేయాలి.ప్రస్తుతం ప్రభుత్వ బాండ్ల నుంచి వచ్చే వడ్డీ ఆదాయంపై విదేశీ పెట్టుబడిదారులు 20 శాతం విత్‌హోల్డింగ్ పన్ను (టీడీఎస్) చెల్లిస్తున్నారు. (గమనిక.. జులై 1, 2023 వరకు ప్రభుత్వ సెక్యూరిటీలు, రాష్ట్ర అభివృద్ధి రుణాలు, రూపాయి విలువ కలిగిన బాండ్లపై ఈ పన్ను 5 శాతం మాత్రమే ఉండేది. దీనిని తిరిగి సవరించాలని వారు కోరుతున్నారు).

### ఎంపీసీ నిర్ణయాలపైనే అందరి దృష్టి

కొన్ని సంస్థల అంచనా ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ ఆర్డినెన్స్ నిర్ణయం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ముందస్తుగా కుదుర్చుకున్న సమన్వయ వ్యూహంలో భాగమేనని తెలుస్తోంది. నిన్న ప్రారంభమైన ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమీక్షా సమావేశం శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, మార్కెట్లో లిక్విడిటీని పెంచేందుకు సెంట్రల్ బ్యాంక్ కూడా శుక్రవారం కొన్ని కీలక చర్యలను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

## ఎల్‌పీజీ సిలిండర్లు.. ఎన్ని రంగులో..



ఇళ్లలో ఉపయోగించే ఎరుపు రంగు ఎల్‌పీజీ సిలిండర్ అందరికీ తెలిసిందే. అయితే గ్యాస్ సిలిండర్లు ఎరుపు రంగులోనే కాకుండా పలు ఇతర రంగుల్లోనూ కనిపిస్తాయి. ప్రతి రంగు వెనుక ఒక ప్రత్యేక ఉద్దేశం ఉంటుంది. సిలిండర్‌లో ఏ రకం గ్యాస్ ఉందో, అది ఎక్కడ ఉపయోగించాలో గుర్తించేందుకు ఈ రంగు కోడింగ్‌ను ఉపయోగిస్తారు.

**ఎరుపు రంగు సిలిండర్**

భారతదేశంలో ఇళ్లలో వంట కోసం ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్లు సాధారణంగా ఎరుపు రంగులో ఉంటాయి. ఎల్‌పీజీ దహనశీల పదార్థం కావడంతో ప్రమాద హెచ్చరికకు సంకేతంగా ఈ రంగును ఉపయోగిస్తారు. ఇండేన్, భారత్‌గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ వంటి సంస్థలు సరఫరా చేసే సిలిండర్లు ఈ కోవలోకే వస్తాయి.

**నీలం రంగు సిలిండర్**

కొన్ని పరిశ్రమలు, వర్క్‌షాప్‌లు, తయారీ యూనిట్లలో ఉపయోగించే గ్యాస్ సిలిండర్లకు నీలం రంగు కనిపిస్తుంది. భారీ స్థాయిలో తాపన, ప్రాసెసింగ్ వంటి కార్యకలాపాలకు వీటిని వినియోగిస్తారు.

**పసుపు రంగు సిలిండర్**

హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, క్యాటరింగ్ సంస్థలు ఉపయోగించే కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్లు సాధారణంగా పసుపు రంగులో ఉంటాయి. వీటి ధరలు, సరఫరా నిబంధనలు గృహ సిలిండర్లతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి.

**నలుపు రంగు సిలిండర్**

నలుపు రంగు సిలిండర్లలో ఎక్కువగా ప్రొపేన్ గ్యాస్ నిల్వ చేస్తారు. పరిశ్రమలు, హీటింగ్ వ్యవస్థలు, కొన్ని ప్రత్యేక యంత్రాల్లో ఈ గ్యాస్‌ను ఉపయోగిస్తారు. చల్లని ప్రాంతాల్లో కూడా ప్రొపేన్‌కు మంచి డిమాండ్ ఉంటుంది.

**తెలుపు రంగు సిలిండర్**

ఆసుపత్రులు, పరిశోధనా కేంద్రాల్లో ఉపయోగించే ఆక్సిజన్ వంటి వైద్య వాయువులు లేదా ప్రత్యేక గ్యాస్ మిశ్రమాల కోసం తెలుపు రంగు సిలిండర్లను ఉపయోగిస్తారు. వీటిపై కఠిన భద్రతా ప్రమాణాలు అమలులో ఉంటాయి.

**ఆకుపచ్చ రంగు సిలిండర్**

కొన్ని దేశాలు లేదా సంస్థలు పర్యావరణహిత గ్యాస్‌లు, ప్రత్యేక వినియోగ గ్యాస్‌ల కోసం ఆకుపచ్చ రంగు సిలిండర్లను ఉపయోగిస్తాయి. అయితే ఈ రంగు అర్థం ప్రాంతానికీ, సరఫరాదారునికీ అనుగుణంగా మారవచ్చు.గ్యాస్ సిలిండర్ల రంగులు గుర్తింపునకు ఉపయోగపడినా, వాటిపైనే పూర్తిగా ఆధారపడకూడదు.

## హీరో ఫ్లెక్స్-ఫ్యూయల్ బైక్‌లు విడుదల



ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా దేశంలోనే తొలి భారీ స్థాయి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కమ్యూటర్ మోటార్‌సైకిళ్లను హీరో మోటర్‌కార్ప్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంపెనీ తన అత్యంత ప్రజాదరణ పొందిన 'స్ప్లెండర్ ప్లస్', 'హెచ్‌ఎఫ్ డీలక్స్' మోడళ్లను E20 నుంచి E85 వరకు ఇథనాల్ మిశ్రమ ఇంధనంతో నడిచే ఫ్లెక్స్‌ఫ్యూయల్ వెర్షన్లలో విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీ, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి పాల్గొన్నారు. ఫ్లెక్స్‌ఫ్యూయల్ వాహనాలు పెట్రోల్‌తో పాటు అధిక శాతం ఇథనాల్ కలిగిన ఇంధన మిశ్రమాలను కూడా వినియోగించగలవు. దీంతో చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు కార్బన్ ఉద్గారాల నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్‌ఫ్యూయల్ బైక్ ధరను (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్) రూ .82,710గా నిర్ణయించారు. 97.2 సీసీ ఇంజిన్‌తో వచ్చే ఈ బైక్ E85 ఇంధనంపై 8 బీహెచ్‌పీ శక్తి, 8.3 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇథనాల్ వినియోగానికి అనుగుణంగా కొత్త ఫ్యూయల్ పంప్, సవరించిన ఈసీయూ, అప్‌గ్రేడ్ చేసిన ఫ్యూయల్ సిస్టమ్‌ను అందించారు. అదే విధంగా హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్‌ఫ్యూయల్ వాహనం ధర రూ.72,792. దీన్ని కూడా 97.2 సీసీ ఇంజిన్‌తో E20-E85 ఇంధన మిశ్రమాలకు అనుకూలంగా రూపొందించారు. రెండు మోడళ్లలోనూ కొత్త డిజిటల్‌అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సైడ్‌స్టాండ్ ఇంజిన్ కట్‌ఆఫ్, ట్యూబ్‌లెస్ టైర్లు, హీరో పేటెంట్ i3S టెక్నాలజీ వంటి ఫీచర్లు ఉన్నాయి.కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఫ్లెక్స్‌ఫ్యూయల్ బైక్‌ల విక్రయాలు జూలై నుంచి ఢిల్లీఎన్‌సీఆర్, మహారాష్ట్రలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రారంభమవుతాయి. అనంతరం దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కొత్త మోడళ్లతో ఇథనాల్ ఆధారిత హరిత రవాణా దిశగా భారత ద్విచక్ర వాహన రంగంలో మరో కీలక అడుగు పడిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.




## కేరళం తీరాన్ని తాకిన నైరుతి..
# దంచికొడుతున్న వర్షాలు

**నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినట్లు ప్రాథమిక సమాచారం వెలువడుతోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షా లు ఒక్కసారిగా పెరిగి, అనేక జిల్లాల్లో భారీ వర్ష సూచనలు జారీ అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రత పెరగడంతో అధికారులు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. అయితే ఈ ప్రవేశాన్ని భారత వాతావరణ శాఖ (IMD) ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.**



కేరళలోని సుమారు 15 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు స్థానిక వాతావరణ అంచనాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గాలులతో కూడిన వర్షాలు, తీర ప్రాంతాల్లో అలల ఉధృతి పెరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. దీంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.ఇదే సమయంలో కర్ణాటక, తమిళనాడుకు భారీ వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. దక్షిణ తమిళనాడు, చెన్నై ప్రాంతాల్లో కూడా వర్ష సూచనలు వెలువడుతున్నాయి. అక్కడ కూడా మేఘావృత వాతావరణం నెలకొని, రాబోయే గంటల్లో వర్షాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.మరోవైపు నైరుతి రుతుపవనాలు ఈసారి సాధారణం కంటే ఆలస్యంగా, దాదాపు పది రోజుల ఆలస్యంతో కేరళ తీరాన్ని తాకినట్లు నిపుణులు చెబుతున్నారు. అయితే వీటి తీవ్రత ఆశించినంత బలంగా లేదని భారత వాతావరణ శాఖ ప్రాథమిక విశ్లేషణలో పేర్కొంది. రుతుపవనాల ప్రస్తుత దశ బలహీనంగానే కొనసాగుతోందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఇక రాబోయే వారం రోజుల్లో ఈ రుతుపవనాలు క్రమంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వైపు విస్తరించే అవకాశం ఉన్నట్లు సూచనలు ఉన్నాయి. మరో వారం తర్వాతే తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడే చాన్స్ కనిపిస్తోంది. దక్షిణ భారతంలో వర్షపాతం పెరుగుతుందా లేదా అన్నది రుతుపవనాల బలం, దిశపై ఆధారపడి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కేరళలో వర్షాలు మొదలైన నేపథ్యంలో అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రాబోయే రోజుల్లో రుతుపవనాల వేగం ఎలా మారుతుందన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## బెంగాల్‌లో మరో సంచలనం..
# మమతకు బిగ్ షాక్!




**కోల్‌కత్తా:** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు రోజురోజుకు మారిపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తృణముల్ కాంగ్రెస్(టీఎంసీ)లో సంక్షోభం మరింత ముదిరింది. టీఎంసీకి చెందిన మంది ఎంపీలు బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇక, ఇప్పటికే టీఎంసీలు ఎమ్మెల్యేలు 60 మంది వేరు కుంపటి పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలు మాజీ సీఎం మమతా బెనర్జీకి ఊహించని షాక్ ఇస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (TMC) ఎంపీలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై రాజకీయ చర్చలు బలంగా జరుగుతున్నాయి. ఇటీవల బీజేపీ ఎంపీ సౌమిత్రా ఖాన్ మాట్లాడుతూ.. 18-20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో అంతర్గత అసంతృప్తి, పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని వార్తలు వచ్చాయి. పార్టీ తన కమిటీలు, అనుబంధ విభాగాలను రద్దు చేసి పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించింది. కాగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ 29 స్థానాలు గెలుచుకుని ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో ఒకటిగా నిలిచింది.ఇదిలా ఉండగా, అంతకుముందు.. బెంగాల్ రాజకీయాల్లో టీఎంసీ చీలికతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఫస్ట్ టైం ఎమ్మెల్యేగా నెగ్గిన రీతాబ్రత బెనర్జీ నేతృత్వంలో తృణమూల్ కాంగ్రెస్ (TMC) లో భారీ తిరుగుబాటు చెలరేగింది. మొత్తం 80 మంది ఎమ్మెల్యేల్లో 60 మంది ఆయనకు మద్దతుగా సంతకాలు చేయడం.. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై తీవ్ర సవాల్‌ను విసిరినట్లయ్యింది.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓడిన వెంటనే పార్టీలో అసంతృప్తి వేగంగా పెరిగింది. పార్టీ అధినేత్రి నివాసంలో జరిగిన కీలక సమావేశానికి 80 మంది ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది(దాదాపు 60 మంది) గైర్హాజరు కావడం పరిస్థితి తీవ్రతను చూపించింది. అంతేకాకుండా, మమతా నిర్వహించిన బహిరంగ నిరసన కార్యక్రమానికి కూడా చాలా తక్కువ మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకావడం పార్టీలో లోతైన విభేదాలను బయటపెట్టింది. విశ్లేషకుల ప్రకారం.. ఇది సిద్ధాంత ఆధారిత తిరుగుబాటు కాదు. ఇది మమతా నాయకత్వంపై అసంతృప్తి, అలాగే ప్రతిపక్ష నేత పదవి సహా అధికార పంపకాలపై ఉన్న ఆగ్రహం కలయికగా కనిపిస్తోంది.

## ఢిల్లీ హోటల్ ఘటన..
# సిలిండర్ పేలుడు కాదంట!



**ఢిల్లీ:** మాలవీయా నగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై.. ప్రాథమిక దర్యాప్తులో కీలక అంశాలు వెలుగు చూశాయి. అగ్ని ప్రమాదానికి సిలిండర్ బ్లాస్ట్ కారణం కాదని పోలీసులు ధృవీకరించారు. దీంతో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ఘోరం జరిగి ఉండొచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. మొదట్లో ఈ అగ్ని ప్రమాదం ఎల్‌పీజీ సిలిండర్ పేలుడు వల్ల జరిగిందా? అనుమానం వ్యక్తమైంది. కానీ దర్యాప్తు బృందాలు ఆ కోణాన్ని ప్రస్తుతం పూర్తిగా తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఘటన స్థలాన్ని పరిశీలించిన తర్వాత సిలిండర్ పేలుడు జరిగినట్లు సూచించే ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో గ్యాస్ ఎక్స్‌ప్లోషన్ కారణమన్న వాదన బలహీనపడింది.దర్యాప్తులో బయటపడిన మరో ముఖ్య విషయం ఏమిటంటే.. హోటల్‌లో రెండు వేర్వేరు కిచెన్లు ఉండటం. వాటిలో ఒకటి భవనం బేస్‌మెంట్‌లో ఉండగా, మరొకటి పై అంతస్తులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ రెండు కిచెన్లలోనూ అనేక ఎల్‌పీజీ సిలిండర్లు నిల్వ ఉన్నప్పటికీ, అవి ఏదీ పేలిన ఆనవాళ్లు మాత్రం కనిపించలేదని ప్రాథమిక తనిఖీల్లో తేలింది.ఈ పరిస్థితుల నేపథ్యంలో మంటలు ఎలా ప్రారంభమయ్యాయి, ఏ ఎలక్ట్రికల్ పాయింట్ నుంచి షార్ట్ సర్క్యూట్ జరిగిందన్న అంశాలపై దర్యాప్తు బృందాలు మరింత లోతుగా పరిశీలిస్తున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. బ్రేక్‌ఫాస్ట్ కోసం వంటమనిషి(చెఫ్) ఎలక్ట్రిక్ స్టవ్ వినియోగ సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతానికి షార్ట్ సర్క్యూట్ కోణమే ప్రధాన అనుమానంగా కొనసాగుతోంది. అయితే, ఇది తుది నిర్ధారణ కాదని, ఫోరెన్సిక్ నివేదిక తర్వాతే పూర్తి స్పష్టత రానుందని అధికారులు పేర్కొంటున్నారు. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ హౌజ్‌రాణి ప్రాంతంలో ఉన్న ఫ్లరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. బుధవారం ఉదయం 8.50 గంటల సమయంలో ప్రారంభమైన మంటలు క్షణాల్లో భవనం అంతటా వ్యాపించడంతో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భారతీయులతో పాటు ఆఫ్రికా, తుర్క్‌మెనిస్థాన్‌కు చెందిన విదేశీయులు కూడా ఉన్నారు. గురుగ్రావ్‌కు చెందిన 8 మంది కుటుంబ సభ్యులు మరణించారు. మరో 35 మంది గాయపడగా, వారిలో 19 మంది పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. భవనంలో ఒకే ఎగ్జిట్ ఉండటం, అనుమతులకు మించి గదులు నిర్వహించడం, బేస్‌మెంట్‌తో సహా అనధికార నిర్మాణాలు ఉండటం వల్ల ఎక్కువ మంది బయటపడలేకపోయారని అధికారులు చెబుతున్నారు. కొందరు కిటికీల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకోగా, ఒక మహిళ తన చిన్నారితో సహా మూడో అంతస్తు నుంచి దూకిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఈ హోటల్ ప్రభుత్వ B&B పథకం కింద నడుస్తుండగా, కేవలం ఆరు గదుల అనుమతి ఉన్నా 25 గదుల వరకు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరారీలో ఉన్న హోటల్ యాజమానిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేయగలిగారు. ప్రమాద సమయంలో తాను అక్కడే ఉన్నానని.. భయంతో పారిపోయానని చెబుతున్నాడతను.

# ఆస్తికోసం వ్యాపారవేత్త కుటుంబం దారుణ హత్య, ఆ తర్వాత షాకింగ్ ఘటన

**ప్రయాగ్‌రాజ్ :** డబ్బు, ఆస్తి మీద విపరీతమైన వ్యామోహంతో ఎంతటి దారుణానికైనా తెగ బడుతున్నారు మనుషులు. మానవ విలువల్ని, బంధాల్ని బంధుత్వాల్ని మరిచి సొంత తల్లిదండ్రులను, తోగబుట్టిన సోదరిని హత్య చేశాడో దుర్మార్గుడు. చివరికి అతను కూడా అదే అత్యాశకు బలైపోయాడు. ఉత్తర ప్రదేశ్‌లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని భవనంలోఈ దారుణ ఘటన వెలుగు చూసింది. కర్మ ఎవరిని విడిచిపెట్టదనే సూత్రం వీరి విషయంలో అక్షరాలా నిజమైంది. పోలీస్ కమిషనర్ జోగేంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌత్ మలకా ప్రాంతంలో ఉన్న ఒక కుటుంబంలో ఆస్తి పంపకాల విషయంలో వివాదం నెలకొంది. వీరేంద్ర వైశ్య, ఆయన భార్య తమ ఆస్తి నుండి కుమారుడు అభిషేక్‌కు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. దీంతో వారి అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు అభిషేక్. తల్లిదండ్రులు, సోదరిని చంపడానికి ప్లాన్ చేశాడు. ఇందులో భాగంగానే తన స్నేహితుడు సన్నీ గుప్తాను ఇంటికి పిలిపించుకున్నాడు. ప్లాన్ ప్రకారం వారిని మట్టుబెట్టాడు. ఆ తర్వాత, ఇద్దరూ కలిసి ఇంటో దొంగిలించిన విలువైన వస్తువులను పంచుకోవడానికి గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణానికి వెళ్లారు. అయితే ఈ పంపకాల సమయంలో ఇద్దరి మధ్య తీవ్రమైన గొడవ జరిగింది. దీంతో ఏరాడ్‌తో అయితే తల్లిదండ్రులను హత్య చేశాడో అదే రాడ్‌తో అభిషేక్‌ను హత్య చేసి, శవాన్ని దుకాణంలోనే వదిలేసి, షాప్‌కు తాళం వేసి అక్కడి నుంచి పారిపోయాడు సన్నీ.రెండు రోజుల తరువాత ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా భయంకరమైన దృశ్యం కనిపించింది. మే 31 సాయంత్రం అభిషేక్, గుప్తాతో కలిసి వీరేంద్ర, అనిత, మీనాక్షిలను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో వీరేంద్ర వైశ్య (70), ఆయన భార్య అనిత (65), కుమార్తె మీనాక్షి (45) మృతదేహాలను స్వాధీనం తీసుకున్నారు.మొదట, అభిషేక్ హంతకుడై ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావించి, అతని కోసం గాలించారు.. కానీ మృతదేహాలపై డిటర్జెంట్, శుభ్రపరిచే రసాయనాలుపూసి ఉండటంతో, రక్తపు మరకలున్న టీషర్టు, కుటుంబ కలహాలు, ఆభరణాలచోరీ , నకిలీ నోట్ ఆధారంగా హత్య పథకాన్ని వారు వెలికితీశారు. అదే భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న తాళం వేసిన దుకాణాన్ని బలవంతంగా తెరిచారు. అక్కడ అభిషేక్ వైశ్య (40) మృతదేహం లభించింది. సిసిటివి ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలించి నిందితుడైన సన్నీగుప్తాను అదుపులోకి తీసుకున్నారు.




మహా పత్రిక











# చిరంజీవితో ఛాన్స్ మిస్సైన హీరోయిన్..

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి సరసన నటించే అవకాశం వస్తే చాలు, తెరపై ఒక్క క్షణమైనా కనిపించాలని ఎంతోమంది నటీనటులు ఆరాటపడుతుంటారు. అలాంటిది ఒక క్రేజీ ముద్దుగుమ్మకు మెగాస్టార్ సినిమాలో నటించే అద్భుతమైన అవకాశం వచ్చినా.. అనుకోని కారణాలతో ఈ అమ్మడు క్రేజీ ఛాన్స్ మిస్సైందని టాక్.ఆ బ్యూటీ మరెవరో కాదు.. 'వీరసింహారెడ్డి' చిత్రంతో టాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన మలయాళ కుట్టి హనీ రోజ్. ఒక్క సినిమాతోనే తెలుగులో సెన్సేషన్ అయ్యింది.హనీ రోజ్ గతంలోనే తెలుగులో కొన్ని సినిమాలు చేసినప్పటికీ, 2023లో నందమూరి బాలకృష్ణ సరసన నటించిన 'వీరసింహారెడ్డి' సినిమా ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది.ఈ సినిమాలో మీనాక్షి పాత్రలో తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుందామె. ఆ సినిమా సక్సెస్ తర్వాత హనీ రోజ్‌కు టాలీవుడ్‌లో ఊహించని ఫాలోయింగ్ వచ్చింది.ఇటీవల మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఒక ప్రతిష్టాత్మక చిత్రంలో హనీ రోజ్‌కు ఒక కీలక పాత్ర కోసం ఆఫర్ వచ్చిందట. ఈ గోల్డెన్ ఛాన్స్ రాగానే ఆమె ఎంతో ఎగ్జైట్ అయ్యిందని టాక్.అయితే ఏమైందో ఏమో కానీ, అంతలోనే ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందని, తెలుగులో వచ్చిన మరో క్రేజీ ఛాన్స్ మిస్సైందని టాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్లే తప్పుకుందని ప్రచారం నడుస్తుంది. మెగాస్టార్‌తో నటించే ఒక మంచి గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్నట్లేనని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# వయ్యారాలతో చంపేస్తోన్న రాశా టడానీ..

బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ గారాల పట్టి, యంగ్ బ్యూటీ రాషా తడాని టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న 'శ్రీనివాస మంగాపురం'లో రాషా హీరోయిన్‌గా నటిస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వంలో, అశ్విని దత్ సమర్పణలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా జూలై 9న రిలీజ్‌కు సిద్ధమవుతోంది.మే 30న సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ చిత్ర యూనిట్ నిర్వహించిన ఒక వేడుకలో రాషా తడాని తన స్టన్నింగ్ లుక్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది.సాంప్రదాయ లంగా వోణీ (హాఫ్ శారీ) ధరించి ఎంతో హుందాగా, డాస్లింగ్ లుక్‌లో ఆమె మెరిసిపోయింది. సాధారణంగా మోడ్రన్ వెస్ట్రన్ డ్రెస్సుల్లో కనిపించే ఈ బాలీవుడ్ భామ..పక్కా తెలుగుదనం ఉట్టిపడేలా హాఫ్ శారీలో కనిపించడంతో టాలీవుడ్ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. రాషా తడాని లేటెస్ట్ ఫోటో గ్యాలరీ ఇప్పుడు వైరల్ అవుతోంది.భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉన్న ఆమె ఫోటోలు చూసి నెటిజన్లు "పర్ఫెక్ట్ ట్రెడిషనల్ బ్యూటీ" అంటూ కామెంట్స్ కురిపిస్తున్నారు.సినిమా తిరుపతి బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ కావడంతో, ఆమె లుక్ కూడా దానికి తగ్గట్లే ఎంతో నేచురల్‌గా మరియు హోమ్లీగా ఉందనే ప్రశంసలు దక్కుతున్నాయి.

# ముచ్చటగా మూడోసారి పెళ్లి పీటలెక్కనున్న అమీర్ ఖాన్..

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్. 1973లో విడుదలైన 'యాదో కీ భారత్' చిత్రంలో ఆయన బాలనటుడిగా నటించారు. ఆ తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్ అయ్యాడు. అతను 90లలో హీరోగా పరిచయమయ్యాడు. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అయితే అమీర్ ఖాన్ హీరోగా మొదటి సినిమా యామత్ సే ఖయామత్ తక్. ఈ సినిమాకు అమీర్ కజిన్ మన్సూర్ ఖాన్ డైరెక్ట్ చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ జూహీ చావ్లా నటించింది. ఈ సినిమా సంచలన విజయం సాధించింది. ఈ సినిమాతో అమీర్, జూహీ చావ్లా ఇద్దరూ స్టార్స్ అయ్యారు. ప్రస్తుతం అతడు నిర్మాతగా మారి వరుస సినిమాలను నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో అత్యంత ధనవంతులైన నటులలో ఆమిర్ ఖాన్ ఒకరు. 1973లో విడుదలైన 'యాదో కీ భారత్' చిత్రంలో ఆయన బాలనటుడిగా నటించారు. ఆ తర్వాత అసిస్టెంట్ డైరెక్టర్ అయ్యాడు. అతను 90లలో హీరోగా పరిచయమయ్యాడు. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.అమీర్ ఖాన్ 1986లో రీనా దత్తాను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు జునైద్ ఖాన్, ఇరా ఖాన్. కానీ ఆమిర్ ఖాన్ 2002లో రీనా దత్తాను విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత 2005లో దర్శకుడు, నిర్మాత కిరణ్ రావును వివాహం చేసుకున్నాడు. వారికి ఆజాద్ అనే కుమారుడు ఉన్నాడు. 16 సంవత్సరాల వివాహం తర్వాత 2011లో విడాకులు తీసుకున్నారు. ఇప్పుడు గౌరీ స్ప్రట్ అనే మహిళతో ప్రేమలో ఉన్నారు.ఈ ఇద్దరూ కలిసి చట్టపట్టాలేసుకు తిరుగుతున్నారు. ఇక ఈ ఇద్దరూ ఇప్పుడు పెళ్లి చేసుకోబోతున్నారని జోరుగా ప్రచారం జరుగుతుంది. జులై లో వీరు వివాహం చేసుకోబోతున్నారని అంటున్నారు. ఈ ప్రచారం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అమీర్ ఖాన్ జులై 5న తన నివాసంలోనే అత్యంత సన్నిహితలు , కుటుంబసభ్యుల మధ్య వివాహం జరగనుందని తెలుస్తుంది. అమీర్, గౌరీ స్ప్రట్ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధువులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరవుతారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా ఈ వార్తపై అమీర్ కానీ గౌరీ స్ప్రట్ కానీ ఇప్పటివరకు స్పందించలేదు.



# ఇండస్ట్రీలో గోల్డెన్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న సంయుక్త మీనన్

మలయాళీ ఇండస్ట్రీలో వరుస సినిమాలతో అలరించింది. అతి తక్కువ సమయంలోనే నటిగా ప్రశంసలు అందుకుంది సంయుక్తమీనన్. తెలుగులోనూ మొదటి సినిమాతోనే సూపర్ హిట్ ఖాతాలో వేసుకుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భీమ్లా నాయక్ సినిమాతో పరిచయమైంది.మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత మరిన్ని చిత్రాల్లో నటించింది. ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ హిట్స్ గా నిలిచాయి. కళ్యాణ్ రామ్ జోడిగా బింబిసార, ధనుష్ సరసన సార్, సాయి ధరమ్ తేజ్ జోడిగా విరూపాక్ష చిత్రాల్లో నటించింది. ఈ మూవీ చిత్రాలు భారీ విజయాన్ని అందుకున్నాయి.కానీ ఆ తర్వాత కళ్యాణ్ రామ్ నటించిన డేవిల్ చిత్రం నిరాశపరిచింది. అయినా కూడా ఈ అమ్మడికి క్రేజ్ తగ్గలేదు. ఇటీవలే అఖండ 2, నారి నారి నడుమ మురారి సినిమాలతో రెండు హిట్స్ అందుకుంది. ఇలా వరుసగా హిట్స్ అందుకుంటూ గోల్డెన్ బ్యూటీగా మారిపోయింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.



# ఏం అందం సామి..

రాశి సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. టాలీవుడ్‌కి ఇటీవల ఎంట్రీ ఇచ్చిన కొత్త హీరోయిన్లలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. రాశి సింగ్ మొట్టమొదట "జెమ్" సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. అయితే ఈ ముద్దుగుమ్మ చిన్నప్పటి నుండి సీరియల్స్ చూసి యాక్టర్ కావాలని ఆసక్తి కలిగిందట.ఈ ముద్దుగుమ్మ 14 ఏళ్ల వయసులో ఓ కమర్షియల్ యాడ్ లో నటించింది ఈ ముద్దుగుమ్మ మొదటి లో ఎయిర్ హోస్ట్ గా కెరీర్ ను ప్రారంభించింది.ఆ తర్వాత హైదరాబాద్ లో ఉద్యోగం చేసుకుంటూ నటన మీద ఉన్న మక్కువతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది రాశి సింగ్. రాశీ సింగ్ లో జెమ్, పోస్టర్, శశి, ప్రేమ్ కుమార్ వంటి సినిమాల్లో అలరించింది. ఈ మధ్య కాలంలో భూతద్దం భాస్కర్ నారాయణ నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ.ఇది ఇలా ఉంటే రీసెంట్ గా సుహాస్ హీరోగా నటించిన 'ప్రసన్నవదనం'తో ఇటీవల ఆడియన్స్ ను పలకరించింది రాశి సింగ్.సినిమాల్లో అంతగా అవకాశాలు రాకపోయిన సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటుంది. ప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్ లతో అలరిస్తూ ఉంటుంది.



# బ్లాక్ డ్రెస్‌లో క్యూట్‌గా..

సీరియల్స్‌లో సందడి చేసే ముద్దుగుమ్మలు ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. అంతే కాకుండా తమ అంద చందాలతో అందరినీ మాయ చేస్తున్నారు. అందులో కన్నడ బ్యూటీ కృతికా ఉమాశంకర్ కూడా ఒకరు. ఈ బ్యూటీ పొదరిల్లు సీరియల్ ద్వారా తెలుగు అభిమానులకు పరిచయం అయ్యింది. అంతే కాకుండా ఈ సీరియల్‌లో తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ బ్యూటీ సీరియల్‌లో మహాలక్ష్మి పాత్రలో నటిస్తూ, తన నటన, అందంతో అందరి మనసు దోచేస్తుంది. తన క్యూట్ నెస్‌తో అందరి మనసు దోచేస్తుంది. ఈ బ్యూటీ అసలు పేరు కృతికా ఉమాశంకర్, ఈ అమ్మడు కన్నడలో పలు సీరియల్స్ చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు తెలుగులో కూడా నటిస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది. మోడల్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన ఈ అందాల చిన్నది, కన్నడలో సీరియల్స్‌లో ఛాన్స్ కొట్టేసింది, అ లాగే తెలుగులో కూడా అవకాశాలు అందుకుంటుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తన బ్యూటిపుల్ ఫొటోలతో అభిమానుల మనసు దోచేసుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ డ్రెస్‌లో సింపుల్ లుక్‌లో కనిపిస్తూ తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ వైరల్ అవుతున్నాయి.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com